Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 189 మేడ్చల్ మల్కాజ్‌గిరి 31 జూలై 2024 బుధవారం పేజీలు : 4

### వయనాడ్ విలయం.. పెరుగుతున్న మృతుల సంఖ్య

కేరళ: వయనాడ్‌లో భారీ వర్షాలు కొండచరియలు విరిగిపడిన ఘటనలో మృతుల సంఖ్య పెరుగుతోంది. ప్రస్తుతం మృతుల సంఖ్య 24 మందికి చేరింది. మొత్తంగా 70 మందికి గాయాలైనట్టు సమాచారం. ఎన్డీఆర్ఎఫ్, కేఎస్‌డీఆర్ఎఫ్ సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ప్రజలను రక్షించేందుకు యత్నిస్తున్నా మని కేరళ మంత్రి వీణా జార్జ్ అన్నారు. కేరళలో వర్షాలు విధ్వంసం జరుగుతోంది. ముఖ్యంగా వయనాడ్‌ను అయితే వరదలు చుట్టుముట్టాయి. దీంతో అక్కడి పరిస్థితి దయనీయంగా మారింది. ఎక్కడికక్కడ కొండచరియలు విరిగి పడుతున్నాయి. ఈ ప్రమాదంలో ఇప్పటి వరకూ 24 మంది మరణించినట్టు గుర్తించారు. మృతులకు 2 లక్షలు, గాయపడిన వారికి 50 వేల పరిహారాన్ని ప్రధాని మోదీ కార్యాలయం ప్రకటించింది.

# కొలిక్కి వచ్చినట్లేనా...?





## టీపీసీసీ చీఫ్ ఎంపిక ప్రక్రియ.. ప్రకటన ఎప్పుడంటే..!?

హైదరాబాద్: తెలంగాణ పీసీసీ అధ్యక్షుడిపై దాదాపుగా స్పష్టత వచ్చింది. సామాజిక సమీకరణాల ఆధారంగా ఎంపిక చేసినట్టు తెలుస్తోంది. 15 రోజుల్లో కొత్త పీసీసీ చీఫ్ అభ్యర్థి పేరును ప్రకటించే అవకాశం ఉంది. టీ పీసీసీ పోస్ట్ కోసం బీసీ, ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు చెందిన కీలక నేతలు జోరుగా లాబీయింగ్ చేశారు. కొద్దిరోజులు ఢిల్లీలోనే మకాం వేశారు. చివరికి హైకమాండ్ ఎస్టీ నేత వైపు మొగ్గుచూపారని విశ్వసనీయ సమాచారం. అభ్యర్థి ఎవరనే అంశం కొద్దిరోజుల్లో తేలనుంది.

**అంతా ఓకే.. కానీ :** పీసీసీ చీఫ్ ఎంపిక కోసం ఇటీవల పలుమార్లు సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళ్లారు. హైకమాండ్ పెద్దలతో మాట్లాడారు. మంత్రులు, కీలక నేతల సూచనలను కూడా అధిష్ఠానం పరిగణలోకి తీసుకున్నట్టు తెలుస్తోంది. ఎస్టీ (లంబాడ) సామాజిక వర్గానికి చెందిన నేతకు పదవి ఇచ్చేందుకు సుముఖంగా ఉంది. మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. అతని అభ్యర్థిత్వంపై సీఎం రేవంత్ సహా మంత్రులు, కీలక నేతలు సానుకూలంగా ఉన్నారని సమాచారం. అందరి అభిప్రాయం తీసుకునే బలరాం నాయక్ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేశారని, ప్రకటించడమే మిగిలి ఉందని కాంగ్రెస్ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతుంది.

**ఆలస్యం ఎందుకంటే..? :** పీసీసీ చీఫ్ అభ్యర్థిత్వం కన్ఫామ్ అయ్యింది. సీఎం రేవంత్ రెడ్డి వచ్చేనెల 2వ తేదీ నుంచి విదేశాలకు వెళుతున్నారు. ఫారిన్ టూర్ ముగించుకొని 14వ తేదీన స్వదేశం తిరిగొస్తారు. ఆయన రాష్ట్రానికి వచ్చిన తర్వాత పీసీసీ చీఫ్‌ను ప్రకటిస్తారు. సీఎం రేవంత్ రాష్ట్రంలో ఉండకపోవడంతో పీసీసీ చీఫ్ అభ్యర్థి ప్రకటన వాయిదా పడింది. వర్కింగ్ ప్రెసిడెంట్ పదవిపై స్పష్టత వచ్చిందని కాంగ్రెస్ నేతల్లో చర్చ జరుగుతోంది. బీసీ సామాజిక వర్గానికి చెందిన నేతకు కార్యనిర్వాహక అధ్యక్ష పదవి ఇచ్చే అవకాశం ఉంది.


**రెండు పదవులు :** గత 8 నెలల నుంచి రేవంత్ రెడ్డి సీఎం పదవితోపాటు పీసీసీ చీఫ్‌గా వ్యవహరిస్తున్నారు. రేవంత్ పీసీసీ చీఫ్‌గా అసెంబ్లీ ఎన్నికలకు వెళ్లి, పార్టీని విజయతీరాలకు చేర్చారు.

రేవంత్‌ను సీఎం పదవి వరించింది. ముఖ్యమంత్రి పదవి చేపట్టినప్పటికీ పీసీసీ చీఫ్‌ను హైకమాండ్ ఎంపిక చేయలేదు. వివిధ కారణాలతో ఎంపిక ప్రక్రియ వాయిదా పడింది. వెంటనే లోక్ సభ ఎన్నికలు, ఇతర అంశాలతో అగ్ర నేతలు తీరిక లేకుండా గడిపారు. దాంతో పీసీసీ చీఫ్ అభ్యర్థి అంశం పెండింగ్‌లో ఉంది.

ఇన్నాళ్లకు అభ్యర్థిని ఖరారు చేశారు. కొద్దిరోజుల్లో పేరు ప్రకటిస్తామని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు.

**విధేయతకే పట్టం..పీసీసీ అధ్యక్షుడి ఎంపికలో ట్విస్ట్..!** తెలంగాణ పీసీసీ అధ్యక్షుడిపై స్పష్టత వచ్చినట్లు తెలుస్తోంది. అనేక సంప్రదింపులు.. సమాలోచనల తర్వాత తెలంగాణ పీసీసీ బాస్ ఎవరనే దానిపై అధిష్టానం తుది నిర్ణయానికి వచ్చినట్లుగా సమాచారం. సామాజిక సమీకరణాలు.. విధేయత ఆధారంగా కొత్త అధ్యక్షుడి నియామకం పూర్తి చేసినట్లుగా తెలుస్తోంది. పీసీసీ చీఫ్ పదవి కోసం కాంగ్రెస్ సీనియర్ నేతలు గత కొద్ది రోజులుగా ఢిల్లీలోనే మకాం వేసి తీవ్రస్థాయిలో లాబియింగ్ కొనసాగించారు. బీసీ సామాజిక వర్గం నుంచి మహేష్ కుమార్ గౌడ్, మధు యాష్కీలు పోటీ పడగా.. ఎస్సీ సామాజిక వర్గం నుంచి సంపత్ కుమార్..ఎస్టీ సామాజిక వర్గం నుంచి ఎంపీ బలరాం నాయక్ పేర్లు ప్రధానంగా వినిపించాయి. ప్రస్తుతం వర్కింగ్ ప్రెసిడెంట్ గా కొనసాగుతోన్న మహేష్ కుమార్ గౌడ్ పేరు ఖరారు అయిందని ఆ మధ్య జోరుగా ప్రచారం జరిగింది. మహేష్ కుమార్ గౌడ్ అభ్యర్థిత్వాన్ని రేవంత్ సైతం బలపర్చారని దాంతో కొద్ది రోజుల్లోనే అధిష్టానం అధికారిక ప్రకటన చేయనుందని వార్తలు వచ్చాయి. కానీ , అధిష్టానం మాత్రం పీసీసీ అధ్యక్షుడి ఎంపికలో ఊహించని విధంగా ట్విస్ట్ ఇచ్చింది.

ఎంపీ బలరాం నాయక్ వైపు హైకమాండ్ మొగ్గు చూపిందని తెలుస్తోంది. గతంలో కేంద్రమంత్రిగా కూడా పని చేసిన బలరాం నాయక్ కు కాంగ్రెస్ పెద్దలతో మంచి సత్సంబంధాలు ఉండటంతోపాటు పార్టీకి విధేయుడిగా ఆయనకు పేరుంది. ఆయన విధేయతను పరిగణనలోకి తీసుకొని దాదాపుగా బలరాం నాయక్ పేరును ఖరారు చేశారని.. రేవంత్ విదేశీ పర్యటన ముగించుకొని వచ్చాక ఈ నెల 15న అధికారిక ప్రకటన ఉంటుందని అంటున్నారు.



## మేం తప్పకుండా సహకరిస్తాం...

### వచ్చే సెషన్ 20 రోజులు నిర్వహించాలి : కేటీఆర్

హైదరాబాద్ : సోమవారం ఉదయం 10 గంటలకు శాసన సభ ప్రారంభం కాగా, మంగళవారం తెల్లవారుజామున 3 గంటల వరకు సభ కొనసాగిన నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు కీలక సూచన చేశారు. మంగళవారం ఉదయం 10 గంటలకు సభ ప్రారంభమైన వెంటనే స్పీకర్ అనుమతితో కేటీఆర్ ఈ సూచన చేశారు. ఒకే రోజు 19 పద్దులపై చర్చ జరిపి అప్రూవ్ చేసుకోవాలనే ఉద్దేశంతో మంగళవారం తెల్లవారుజామున 3 గంటల వరకు సభను నడిపారు. సుదీర్ఘ ప్రసంగాలు చేయొద్దన్న శాసనసభ వ్యవహారాల మంత్రి ప్రతిపాదనను అంగీకరిస్తున్నాము. కానీ ఈ సభలో 57 మంది కొత్త సభ్యులు ఉన్నారు.. వారందరూ మాట్లాడాలని అనుకుంటున్నారు. ఇలా రోజుకు 19 పద్దులపై చర్చ పెట్టకుండా.. రోజుకు 2 లేదా 3 పద్దులపైన చర్చ పెట్టాలని కోరుతున్నాం. రేపు ద్ర వ్య విని మయ బిల్లు పెడుతున్నారు. ఈ సమావేశాలు అయిపోయాయి. కానీ వచ్చే అసెంబ్లీ, బడ్జెట్ సమావేశాల్లో రోజుకు 19 పద్దులు పెట్ట కుండా, 2 లేదా 3 పద్దులపై సావధానంగా చర్చ జరిగేలా చర్యలు తీసుకోవాలి. మంత్రులు కూడా సుదీర్ఘ వివరణ ఇచ్చే అవకాశం ఉంటుంది. వచ్చే సెషన్‌ను అవసరమైతే 20 రోజులు పెట్టాలి. మా వైపు నుంచి తప్పకుండా కో ఆపరేషన్ చేస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు.

## ఆగస్టు 1న తెలంగాణ క్యాబినెట్ భేటి



హైదరాబాద్ : తెలంగాణ శాసనసభ సమావేశాలు వాడివేగా కొనసాగుతున్నాయి. ఈ సమావేశాల్లో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ..ఆగస్టు 1న మధ్యాహ్నం 2.30 గంటలకు అసెంబ్లీలో తెలంగాణ క్యాబినెట్ సమావేశం జరుగుతుందని తెలిపారు. గతంలో ఆగస్టు 01న సాయంత్రం 4.30 గంటలకు ఉంటుందని నిర్ణయించాం. కానీ మధ్యాహ్నం 2.30 గంటలకే కేబినెట్ సమావేశం ఉంటుందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. అలాగే పలు విషయాలపై చర్చించారు. కాగా, తెలంగాణకు జరిగిన అన్యాయంపై, పాలమూరు వలసలపై ఆనాడు నేను అసెంబ్లీలో మాట్లాడాను. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ పై నేను అసెంబ్లీలో ఎంత మాట్లాడానో.. కేసీఆర్ పార్లమెంట్ లో ఎంత మాట్లాడారో రికార్డులు తీయండి. ఇతరుల త్యాగాల పునాదులపై అధికారంలోకి వచ్చింది వీళ్లు.. జర్నలిస్ట్ పై కేసు పెట్టామని చెబుతున్న వీళ్లు వారి పాలనలో ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టి ఆమె చానల్‌ను గుంజుకున్నారు. ఇప్పుడు ఆ జర్నలిస్ట్ పై మొసలి కన్నీరు కారుస్తున్నారు. ఆడబిడ్డలను జైల్లో పెట్టినందుకే ఇప్పుడు ఆ పాపం అనుభవిస్తున్నారు. ఆనాడు నన్ను జైల్లో పెట్టినా నేను భయపడలేదు. అబద్దాలు చెబితే నమ్మడానికి ప్రజలు అమాయకులు కాదు. విద్యుత్ పై మీరు ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిది. ఆగస్టు 1, 2న బీఆరెస్ పదేళ్ల పాలనపై చర్చకు సిద్ధం. మీరెంత అబద్ధాలు చెబితే నేను అంత నిజాలు చెబుతానని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఇకపోతే..ఆగస్ట్ 2న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ముగియనున్నాయి. అయితే, అసెంబ్లీ సమావేశాల ముగింపునకు ఒక్క రోజు ముందే తెలంగాణ క్యాబినెట్ భేటీ కానుండటం ఆసక్తిగా మారింది.

ఈ భేటీకి సంబంధించిన అజెండా ఏంటన్నది తెలియనప్పటికీ.. జాబ్ క్యాలెండర్, రైతు భరోసా గైడ్ లైన్స్‌కు సంబంధించిన టాపిక్స్‌పై కేబినెట్ డిస్కస్ చేయనున్నట్లు సమాచారం.



## త్వరలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్

2014కు ముందు యూపీఏ ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థ మెరుగ్గా ఉందని చూపేందుకు బడ్జెట్‌లో భారీ ప్రకటనలు గుప్పించేదని, క్షేత్రస్థాయిలో వాటి అమలును పట్టించుకోలేదని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. వికసిత్ భారత్ దిశగా ప్రస్థానం అనే అంశంపై కేంద్ర బడ్జెట్ 2024-25పై సీఐఐ నిర్వహించిన సదస్సులో ప్రధాని ప్రారంభోపన్యాసం చేశారు. పథకాలను పూర్తి చేసేందుకు గత ప్రభుత్వాలు శ్రద్ధ కనబరచలేదని దుయ్యబట్టారు. గత పదేండ్లుగా తాము ఆ పరిస్థితిని మార్చివేశామని ప్రధాని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంతో పోలిస్తే తాము రైల్వే బడ్జెట్‌ను 8 రెట్లు పెంచామని, హైవేల బడ్జెట్‌ను 8 రెట్లు, వ్యవసాయ బడ్జెట్‌ను 4 రెట్లు పెంచామని తెలిపారు. రక్షణ బడ్జెట్‌ను రెండింతలు పైగా పెంచామని చెప్పుకొచ్చారు. యూపీఏ హయాంలో లక్షలాది కోట్ల రూపాయల విలువైన అవినీతి కుంభకోణాలు వెలుగుచూసిన విషయం అందరికీ తెలిసిందేనని అన్నారు. తాము శ్వేతపత్రం రూపంలో దేశ ఆర్థిక వ్యవస్థ ముఖచిత్రాన్ని దేశ ప్రజల ముందుంచామని చెప్పారు. మనం ఎక్కడ ఉన్నామనేదానిపై చర్చ జరగాలని చెప్పారు. భారత పరిశ్రమలను నూతన శిఖరాలకు చేర్చామని తెలిపారు. దేశ అభివృద్ధికి మూలధన వ్యయం కీలకమని 2004లో యూపీఏ తొలి బడ్జెట్‌లో మూలధన వ్యయం కేవలం రూ. 90,000 కోట్లు కాగా, ఇప్పుడు తమ ప్రభుత్వం రూ. 11 లక్షల కోట్లు పైగా మూలధన వ్యయం వెచ్చిస్తోందని ఈ నిధులతో దేశంలో మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఇవాళ మనం వికసిత్ భారత్ దిశగా పయనిస్తున్నామని, ఈ మార్పు కేవలం సెంటిమెంట్లతో రాలేదని, ఆత్మవిశ్వాసంతోనే ఇది సాధ్యమైందని అన్నారు. ప్రపంచంలో మనం ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగామని, భారత్ త్వరలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.




## రుణమాఫీ నిధులు విడుదల

# మాట నిలబెట్టుకున్న రేవంతుడు

హైదరాబాద్ : తెలంగాణలో రైతులకు రేవంత్ సర్కార్ ఇవాళ మరో గుడ్‌న్యూస్ చెప్పబోతోంది. రుణమాఫీ రెండోవిడత జూలై 30న విడుదల చేసింది. రెండు విడత రుణ మాఫీలో భాగంగా లక్షన్నరలోపు ఉన్న వారికి రుణమాఫీ చేసింది. మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి ఈ రుణమాఫీని విడుదల చేశారు. జిల్లాల వారీగా రుణమాఫీ పొందిన వారి వివరాలు చూస్తే.. నల్లగొండ జిల్లాలో 51వేల 515 రైతుల ఖాతాల్లో 514 కోట్లు జమ చేసింది సర్కార్. నాగర్ కర్నూల్ జిల్లాలో 32వేల 406 రైతుల ఖాతాల్లో 312 కోట్లు, సంగారెడ్డి జిల్లాలో 27వేల 249 రైతులకు 286 కోట్లు విడుదల చేసింది. సిద్దిపేట జిల్లాలో 27వేల 875 రైతులకు 277 కోట్లు, సూర్యాపేట జిల్లాలో 26వేల 437రైతులకు 250 కోట్లు కేటాయించింది.

ఖమ్మం జిల్లాలో 33వేల 942రైతులకు 262 కోట్లు, రంగారెడ్డి జిల్లాలో 24వేల ఏడుమంది రైతులకు 229 కోట్లు, మెదక్ జిల్లాలో 22వేల 850మంది రైతులకు 216 విడుదల చేసింది తెలంగాణ సర్కార్. ఇక వికారాబాద్ జిల్లాలో 23వేల 912మంది రైతులకు 240 కోట్లు రిలీజ్ చేసింది. మహబూబ్‌నగర్ జిల్లాలో 22వేల 253మంది రైతులకు 219 కోట్లు, నిజామాబాద్ జిల్లాలో 23వేల 769మంది రైతులకు 219 కోట్లు, కరీంనగర్ జిల్లాలో 21వేల 785మంది రైతులకు 207 కోట్లు విడుదల చేసింది సర్కార్.

కామారెడ్డి జిల్లాలో 24వేల 816మంది రైతులకు 211 కోట్లు, నిర్మల్ జిల్లాలో 18వేల 728మంది రైతులకు 196 కోట్లు, యాదాద్రి భువనగిరి జిల్లాలో 18వేల 127మంది రైతులకు 177 కోట్లు విడుదల చేశారు. జగిత్యాల జిల్లాలో 17వేల 903మంది రైతులకు 169 కోట్లను రుణమాఫీ కింద రిలీజ్ చేసింది ప్రభుత్వం.

# సంపాదకీయం

## ప్రశాంత్ కిశోర్ రాజకీయ పార్టీ రెడీ!

ప్రశాంత్ కిశోర్ అలియాస్ పీకే రాజకీయ వ్యూహకర్త అవతార్ నుంచి పూర్తి స్థాయి రాజకీయ నాయకుడి అవతారానికి సిద్ధమైపోయారు. ఆయన కొత్త పార్టీ స్థాపనకు రెడీ అయిపోయారు. మరో రెండు నెలలలో ప్రశాంత్ కిశోర్ కొత్త పార్టీ స్థాపన జరగనుంది. ఈ విషయాన్ని ప్రశాంత్ కిశోర్ ప్రకటించారు. తాను ప్రస్తుతం నడుపుతున్న జన్ సురాజ్ అనే సామాజిక సంస్థ పేరునే కొత్త పార్టీకి మారుస్తూ రాజకీయ ప్రస్థానానికి శ్రీకారం చుడుతున్నట్లుగా వెల్లడించారు. అక్టోబర్ 2 గాంధీ జయంతి నాడు జన్ సురాజ్ ని రాజకీయ పార్టీగా మారుస్తూ కీలక నిర్ణయం దిశగా అడుగులు వేస్తున్నట్లుగా తెలిపారు. ఇదిలా ఉంటే రాజకీయ వ్యూహకర్తగా ఐ పాక్ వ్యవస్థాపకుడిగా ప్రశాంత్ కిశోర్ దేశంలో అందరికీ తెలిసిన వారుగా ఉన్నారు. ఇక ఏపీలో 2019 ఎన్నికల్లో వైసీపీని అధికారంలోకి తీసుకుని రావడంలో తనదైన వ్యూహాలను అందించానని పీకే చెప్పుకుంటారు. అలా ఆయన ఏపీకి పరిచయం. ఇటీవల ఎన్నికల్లో పీకే టీడీపీకి కూడా పరోక్షంగా రాజకీయ సలహాలు ఇచ్చారని వ్యూహాలలో సాయం చేశారని ప్రచారం సాగింది. ఇదిలా ఉంటే బీహార్ లో 2025 నవంబర్ లో శాసనసభకు ఎన్నికలు జరగబోతున్నాయి. ఆ ఎన్నికలో అధికార జేడీయూ బీజేపీ కూటమిని ఢీ కొట్టడానికి పీకే జన్ సురాజ్ ని సిద్ధం చేస్తున్నట్లుగా తెలుస్తోంది. తాము నితీష్ ని గద్దె నుంచి దించుతామని ఆయన చెబుతున్నారు. మరి విపక్ష కూటమిగా ఇండియా కూటమి ఉంది. పీకే సొంతంగా పోటీ చేస్తారా లేక కూటమితో చేతులు కలుపుతారా అన్నది చూడాలి ఏది ఏమైనా పీకే రాజకీయ అవతారం మాత్రం ఆసక్తిని రేపుతోంది. వ్యూహాలు రూపొందించడం వేరు, రాజకీయాలను ప్రత్యక్షంగా చేయడం వేరు. జనాలలో ఇమేజ్ ఉండాలి. వారి విశ్వాసం చూరగొనాలి. ఆ విధంగా చూస్తే ఈ బిహారీ బాబు తన సొంత రాష్ట్రం ప్రజల నమ్మకాన్ని ఏ మేరకు పొందుతారు అన్నది రానున్న కాలమే నిర్ణయించబోతుంది అని అంటున్నారు.

# రైతుకు ఆర్థిక పరిపుష్టతనివ్వడమే లక్ష్యంగా రైతు రుణమాఫీ...

రైతు రుణమాఫీ తో రైతాంగం మరింత అభివృద్ధి చెందుతుంది...

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్







జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజ్గిరి (గరుడ వార్త) రైతురుణ మాఫీ తో రైతుల ముఖాలలో ఆనందాన్ని నింపడమే కాకుండా, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకొని అధిక పంటలు పండించి రాష్ట్రాన్ని, రైతు కుటుంబాలను ఆర్థికంగా పరిపుష్టతనివ్వడమే రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతమ్ అన్నారు. రైతురుణ మాఫీ రెండవ విడత లో భాగంగా జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన రైతురుణ మాఫీ 2024 నిధుల విడుదల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టరు రైతులకు చెక్కులు అందజేసారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఆరు పథకాలలో భాగమైన రైతు రుణ మాఫీ పథకంతో రైతుల ముఖాలలో ఆనందాన్ని నింపడమే కాకుండా, ఈ అవకాశాన్నిరైతులు సద్వినియోగం చేసుకొని రాబోయే రబీ, కరీఫ్ సీజన్లలలో అధిక పంటలు పండించి రాష్ట్రాన్ని, రైతు కుటుంబాలను ఆర్థికంగా పటిష్టపరచడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని అన్నారు. ఈరైతు రుణ మాఫీ కార్యక్రమం పండుగ వాతావరణంగా ఉందని కలెక్టరు హర్షం వ్యక్తం చేసారు. మొదటి విడత రైతురుణ మాఫీ జూలై 18న జరిగిన కార్యక్రమంలో లక్షరూపాయల వరకు ఉన్నరుణాలకు గాను చెక్కులు రైతులకు అందజేయడం జరిగిందని కలెక్టరు తెలిపారు. ఇప్పుడు చేస్తున్నరైతురుణ మాఫీరెండవ విడత లో ఒక లక్ష నుండి లక్షయాభై వేల రూపాయల వరకు చెక్కులు అందజేయడం జరుగుతుందన్నారు. ఏదేని సాంకేతిక కారణాల వలన మీయొక్కరుణ మాఫీ జరగలేదంటే ఆందోళన చెందకుండా గ్రామ, మండల, జిల్లా స్థాయి లలో ఏర్పాటు చేసిన గ్రివెన్స్ సెల్ లో మీరు మీ వివరాలు తెలుసుకొని రుణ మాఫీ కానియెడల మరల దరఖాస్తు చేసుకోవచ్చాన్నారు. రైతుల రుణం వేర్వేరు ప్రాంతాలలో వివిధ బ్యాంకులలో ఉన్నా సరే రుణాలు మాఫీ అవ్వడం జరుతుందని కలెక్టరు తెలిపారు. ఏలాంటిగ వదంతులు నమ్మకుండా ప్రభుత్వం అందించేరుణ మాఫీ అర్హులైన రైతులందరికి అందుతుందనే నమ్మకంతోరైతులు ఉండాలన్నారు. రుణ మాఫీ జరిగినరైతులకు వెంటనే రాబోయే రబీ కరీఫ్ పంటలకు అవసరమైన రుణాలను రైతులకు అందించాలని లీడ్ బ్యాంక్ మేనేజరును, బ్యాంకర్లను కలెక్టర్ ఆదేశించారు. మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి మాట్లాడుతూఈ ప్రభుత్వం రైతులకు అందించే ఆర్థిక చేయుత ఏంతో ఉపయోగకరమని , రైతులు ఆందోళన చెందకుండా అర్హులైన అందరికిరుణ మాఫీ అందుతుందన్నారు. రుణమాఫీ మొత్తం లోన్ అకౌంట్లలో పడకపోతే కంగారుపడకుండా ఏర్పాటు చేసిన వ్యవసాయ కేంద్రాలలో దరఖాస్తు చేసుకోవచ్చాన్నారు. మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) రాధికా గుప్తా మాట్లాడుతూ రైతు రుణ మాఫీలో పథకంలో లబ్ధి పొందిన వారందరికి శుభాకాంక్షలు తెలుపుతూ, రాబోయే మూడవ విడుతలో కూడా మిగిలిన వారికిరుణ మాఫీ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ శివ ప్రసాద్, జిల్లా వ్యవసాయ శాఖాధికారి రేఖా మేరి, మున్సిపల్ ఛైర్మన్లు, రైతు సంఘం నాయకులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# వారం రోజుల్లోనే భారీ చోరీ ఛేదించి, దేవాలయ సొత్తును రికవరీ చేసిన శామీర్ పేట పోలీసులు...

**ప్రముఖ ఆలయం కావడంతో కమిషనర్ గారి ఆదేశాల అనుసారం పెట్ బషీరాబాద్ ఏసీపీ రాములు పర్యవేక్షణలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి ఛేదించాము...**

**శామీర్ పేట సీఐ శ్రీనాథ్ డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ మేడ్చల్ సిసిఎస్ పోలీసులతో పాటు ఎస్ఓటి పోలీసులను క్రైమ్ ఎస్ఐ మునీందర్ ను అభినందించిన డిసిపి కోటిరెడ్డి....**

**బంగారు, వెండి ఆభరణాలతో పాటుగా పంచలోహ విగ్రహాలు తిరిగి రత్నాలయ వెంకన్న వద్దకు చేరుకున్నాయి...**



శామీర్ పేట, (గరుడ వార్త) : ప్రముఖ దేవాలయంగా పేరుగాంచిన రత్నాలయ వెంకటేశ్వర స్వామి ఆలయంలో చోరీకి పాల్పడిన దొంగల ముఠా గుట్టు రట్టు చేసి సొత్తు రికవరీ చేసినట్లుగా మేడ్చల్ డిసిపి కోటిరెడ్డి తెలిపారు. మంగళవారం శామీర్ పేట పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన దొంగల ముఠా వివరాలను వెల్లడించారు. శామీర్ పేట మండలం అలియాబాద్ చౌరస్తా రాజీవ్ రహదారి పక్కనే ఉన్న రత్నాలయ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 23 అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు గుడి వెనకనుంచి చొరబడి విలువైన బంగారం, వెండి ఆభరణాలు, పంచలోహ విగ్రహాలను ఎత్తుకెళ్లారు. ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పోలీసులు శామీర్ పేట, ఎస్ఓటి, సిసిఎస్ పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి దాదాపు 400 సీసీ కెమెరాల ఫుటేజ్ ను తనిఖీ చేశారు. దుండగలు ఆరోజు రాత్రి అంతా వాహనాలపై తిరుగుతూ తెల్లవారు జామున ఒకచోట కెమెరాలో అనుమానాస్పదంగా పోలీసుల కంటపడ్డారు. ఈ మేరకు వారిని అదుపులోకి తీసుకొని విచారించగా నేరాన్ని అంగీకరించారు. మేడ్చల్ మండల గుళ్ల పోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకొయకు చెందిన అనిల్, మేడ్చల్ పట్టణానికి చెందిన చింతడ రాజు, రాంనగర్ కి చెందిన అస్లాం అలీ, షరీఫ్ లకు ఈ చోరీతో సంబంధం ఉన్నట్లు పోలీసులు నిర్ధారించారు. వీరిలో అనిల్ రాజు దేవాలయంలో చోరీ చేసిన వస్తువులను అస్లాం, షరీఫ్ కు విక్రయించారు. వారిపై నిగా పెట్టిన పోలీసులు పక్క సమాచారం తో వీరిని మేడ్చల్ మండల మునిరాబాద్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి అమ్మవారి బంగారు, లాకెట్, వెండి ఖడ్గం, బంగారు మంగళసూత్రాలు, శటగోపం, దండకం, కిరీటాలు వడ్డానం, నాగపడిగా, ఉత్సవ విగ్రహాలు, పంచలోహాలతో భూదేవి శ్రీనివాస,ఉత్సవమూర్తి విగ్రహాలు నాలుగు, సుదర్శన చక్రం ఒకటి స్వాధీనం



చేసుకున్నారు, దీంతోపాటు వీరి నుంచి రూ. 80 వేల నగదు, నాలుగు సెల్ ఫోన్లు, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. గత మూడు నాలుగు నెలలుగా వీరు శామీర్ పేట, మేడ్చల్, జీనోమి వ్యాలీ, పెట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ల పరిధిలో 13 దేవాలయాల్లో చోరీకి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. అప్పటి నుంచి తప్పించుకుని తిరుగుతున్న నిందితులను రత్నాలయ చోరీ కేసులో పట్టుకొని పోలీసులు తమదైన పద్ధతిలో విచారించగా నేరం అంగీకరించారని చెప్పారు. ముగ్గురు పట్టుబడగా షరీఫ్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. వారం రోజుల్లో దేవాలయంలో చోరీ చేసిన నిందితులను పట్టుకొని రిమాండ్కు తరలించిన పోలీస్ సిబ్బందిని డిసిపి ప్రత్యేకంగా అభినందించారు. వీరికి రివార్డులు వచ్చే విధంగా ఉన్నతాధికారులతో చర్చించనున్నట్లు డిసిపి వెల్లడించారు. ఈ సమావేశంలో పెట్ బషీరాబాద్ ఏసిపి రాములు, శామీర్ పేట ఇన్స్పెక్టర్ శ్రీనాథ్, డిటెక్టివ్ సిఐ నరసింహా రాజు, సిసిఎస్ సిఐ సిహెచ్ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఘనంగా అన్న ప్రసాద వితరణ

శామీర్ పేట, (గరుడ వార్త) : శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఘనంగా అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రం శామీర్ పేట లోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి ఓడి బియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం





వద్ద శామీర్ పేట కు చెందిన పడకండి వెంకటేష్ చారి- రాజేశ్వరి దంపతులు, వారి కుటుంబ సభ్యులు అక్షయ, సాత్విక, ఊర్మిళలు అన్నదానం చేపట్టారు. వివిధ గ్రామాల భక్తులు, మాజీ ప్రజా ప్రతినిధులు, రాజీవ్ రహదారి పై వెళ్లే భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.

# పనులు చేపట్టాలి.. సౌకర్యాలు కల్పించాలి

ఆదిలాబాద్: టీయూఎఫ్ఐడీసీ (తెలంగాణ పట్టణ ఆర్థిక సమగ్ర అభివృద్ధి సంస్థ) పథకం కింద జిల్లా కేంద్రంలోని డాక్టర్స్‌లేన్‌లో రూ.2 కోట్లతో చేపట్టిన సుందరీకరణ పనులు మధ్యలో నిలిచాయి. దాదాపు కిలోమీటరు వరకు ఇరువైపులా తవ్వకాలు జరిపి వదిలేయడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈ ప్రధాన రహదారికి ఇరువైపులా మల్టీస్పెషాలిటీ ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లు, జూనియర్, డిగ్రీ కళాశాలలు, బ్యాంకులు, వ్యాపార సముదాయాలు ఉన్నాయి. సుందరీకరణ పనుల్లో భాగంగా పాదబాట ఏర్పాటుకు రోడ్డును తవ్వి పనులు పూర్తి చేయకపోవడంతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు వర్ణనాతీతం. ఎన్నికల కోడ్ ముగియడంతో పనులు వేగంగా చేయించాలని ప్రజలు కోరుతున్నారు. గుంతలతో ఉన్న ఈ రోడ్లు జిల్లా కేంద్రంలోని ఆదర్శనగర్‌లోనివి. అధ్వానంగా ఉన్న రోడ్లతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రుల్లో ఈ దారిపై ద్విచక్రవాహనాలపై వెళ్లే వారు ప్రమాదవశాత్తు కిందపడిపోతు న్నారు. ఇక్కడ టీయూఎఫ్ఐడీసీ కింద సీసీ రహదారులు నిర్మించడానికి 'పుర' అధికారులు ప్రతిపాదనలు పంపించారు. నిధులకు ఆమోదం లభించిన వెంటనే టెండర్లు పిలిచి పనులు చేపడుతామని అధికారులు వెల్లడించారు. లోక్‌సభ ఎన్నికల ప్రవర్తనా నియమావళి ముగిసిన నేపథ్యంలో పట్టణాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై 'పుర' పాలకులు, అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. గతేడాది శాసనసభ ఎన్నికలకు ముందు జిల్లాలోని నిర్మల్, భైంసా, ఖానాపూర్ పట్టణాలకు మంజూరైన నిధులతో ప్రతిపాదించిన వివిధ అభివృద్ధి పనులకు అప్పటి భారాస ప్రభుత్వం టెండర్లు నిర్వహించింది. అదే సమయంలో అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావడంతో వాటిని నిలిపివేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని చేపట్టకుండా కొత్తగా ప్రతిపాదనలు పంపించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించింది. స్థానిక ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు, పాలకవర్గాల సూచనల మేరకు పంపించిన ప్రతిపాదనలకు ఆమోదం లభించే తరుణంలో పార్లమెంటు ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో పనులు ఆగిపోయాయి. ఇప్పుడు లోక్‌సభ ఎన్నికల కోడ్ ఎత్తివేయడంతో పట్టణాల్లో ప్రణాళిక, ప్రణాళికేతర, ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక, 15వ ఆర్థిక సంఘం, టీయూఎఫ్ఐడీసీ, సాధారణ నిధులతో వార్డుల్లో సీసీ రహదారులు, మురుగుకాలువల నిర్మాణాలతోపాటు అవసరం ఉన్న ప్రాంతాల్లో వీధి దీపాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. మూడు మున్సిపాలిటీల్లో ఉన్న రూ.69.01 కోట్ల నిధులను వివిధ అభివృద్ధి పనుల కోసం వెచ్చించాల్సి ఉంది.

180 పనులుటీయూఎఫ్ఐడీసీ (తెలంగాణ పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల సంస్థ) కింద జిల్లాలోని నిర్మల్, భైంసా, ఖానాపూర్ పట్టణాలకు రూ.69.01 నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో మూడు పట్టణాల్లోని 80 వార్డుల్లో 180 పనులు చేపట్టడానికి 'పుర' అధికారులు ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. సీసీ రహదారులు, మురుగుకాలువల నిర్మాణాలు, పార్కులు, మినీ స్టేడియం అభివృద్ధి, చెరువుల పునరుద్ధరణ, ఇతరత్రా పనులు చేపట్టాలని నిర్ణయించారు. ఉన్నతాధికారులు, మున్సిపల్ పాలకవర్గం సూచించిన విధంగా పనులు చేపట్టాలని భావించినా పార్లమెంటు ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ప్రతిపాదనలకు ఆమోదం లభించలేదు. ఇప్పుడు కోడ్ ముగియడంతో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు ఆమోదం లభించేలా పాలకులు, అధికారులు కృషి చేయాల్సిన అవసరం ఉంది. వీటిపై దృష్టి పెట్టండిజిల్లా కేంద్రంలోని డాక్టర్స్‌లేన్‌లో గతంలో చేపట్టిన సుందరీకరణ పనులు పూర్తిచేయాలి. నిర్మల్‌లోని ధర్మసాగర్ చెరువు (మినీ ట్యాంక్‌బండ్) వద్ద టీయూఎఫ్ఐడీసీ కింద రూ.65 లక్షల పనులు చేపట్టాల్సి ఉంది. నిర్మల్‌లో రూ.7.20 కోట్లతో తలపెట్టిన సమీకృత మార్కెట్ పనులు నిధుల లేమితో నిలిపివేశారు. గాంధీ కూరగాయల మార్కెట్, ప్రయాణ ప్రాంగణం ఎదుట, ఈద్గాం చౌరస్తా, మంచిర్యాల రోడ్, వివేక్‌చౌక్ ప్రాంతాల్లోని రోడ్లపైనే కూరగాయలు విక్రయిస్తున్నారు. నిర్మల్‌తోపాటు ఖానాపూర్, భైంసా పట్టణాల్లో ఈ పనులు వేగంగా పూర్తి చేయించాలి. భైంసా, ఖానాపూర్ పట్టణాల్లోనూ టీయూ ఎఫ్ఐడీసీ కింద చేపట్టాల్సిన సీసీ రహదారులు, మురుగుకాలువల నిర్మాణాలు భారీ వర్షాలకు కురియకముందే త్వరగా జరిగేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

# హాని చేయకు.. ప్రకృతిని ఆస్వాదించు..!

ఖమ్మం : ప్రకృతిని కాపాడితే అది మనల్ని రక్షిస్తుంది. భూమి, నీరు, గాలి, సహజ వనరులు, మొక్కలు, వన్యప్రాణులు, పర్యావరణాన్ని భవిష్యత్తు తరాల కోసం కాపాడుకోవాలి. వీటి ఆవశ్యకతను గుర్తు చేసేందుకు ఏటా జులై 28న 'ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం' నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది థీమ్ 'ప్రజలను ఏకం చేసి మొక్కలను రక్షించుకోవటం, వన్యప్రాణుల రక్షణకు సాంకేతిక పరిజ్ఞానం వినియోగం' అని నిర్దేశించారు. ఉభయ జిల్లాల్లో పరిస్థితిపై కథనం.సహజ వనరులు ఇవి...

ఖనిజాలు: ఇల్లెందు, సత్తుపల్లిల్లో బొగ్గు గనులు, మాదారంలో డోలమైట్ ఖనిజ నిల్వలున్నాయి.

జలవనరులు: పాలేరు, వైరా, లంకాసాగర్, కిన్నెరసాని, తాలిపేరు ప్రాజెక్టులు

వన్యప్రాణులు: కిన్నెరసాని వన్యప్రాణుల సంరక్షణ కేంద్రం, కనకగిరి అడవులు, ఖమ్మం వెలుగుమట్ల అటవీశాఖ పార్కు, సత్తుపల్లి పార్కు, మినీ ట్యాంకుబండ్లు.

గాలి నాణ్యత పరీక్ష కేంద్రాలు

ఖమ్మం జిల్లాలో వాయు నాణ్యతను నమోదు చేసేందుకు మూడు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఖమ్మం నగరపాలక సంస్థలో రెండు, ట్రాన్స్‌కో కార్యాలయ ఆవరణలో ఒకటి నెలకొల్పుతున్నారు. గాలి తీవ్రతను అంచనా వేసి కాలుష్యాన్ని తగ్గించడమే వీటి లక్ష్యం.

తగ్గుతున్న అటవీ విస్తీర్ణం

ఖమ్మం జిల్లా భౌగోళిక విస్తీర్ణం 4,360 చదరపు కిమీ. ఇందులో అటవీ విస్తీర్ణం 637.135 చ.కి.మీ. 14.66 శాతం అడవులున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భౌగోళిక విస్తీర్ణం 7.8 లక్షల హెక్టార్లు ఉండగా అటవీ విస్తీర్ణం 10,13,460 ఎకరాలు (57.85 శాతం). పోడు వ్యవసాయం, అక్రమ కలప తరలింపుతో రానురాను అటవీ విస్తీర్ణం తగ్గిపోతోంది. వాతావరణ సమతుల్యం దెబ్బతింటోంది.



ఇలా చేద్దాం...

విద్యుత్తును ఆదా చేసుకునేందుకు సౌరశక్తిని వినియోగించాలి.

జల సంరక్షణకు పాటుపడాలి. వాడే నీరు వ్యర్థంగా మారి చివరకు సముద్రంలో కలుస్తోంది. తక్కువ నీరు వాడటం, నీరు నేలలోకి ఇంకిపోయేలా చర్యలు చేపట్టడం, ఇంకుడు గుంతలు తవ్వించటం, చెక్‌డ్యాంలు ఏర్పాటు చేసుకునేలా రైతులను ప్రోత్సహించడం.

దుస్తులు, జనప నార సంచులను ఉపయోగించాలి. ప్రతిదానికీ ప్లాస్టిక్ సంచులను వాడటం పర్యావరణానికి హానికరం

విరివిగా మొక్కలు నాటాలి. ఇవి ఆహారం, ఆక్సిజన్ అందిస్తాయి. శక్తిని ఆదా చేయడం, కాలుష్యాన్ని నివారించి పర్యావరణ సమతుల్యాన్ని కాపాడటంలో సహాయపడతాయి.

జల వనరులను విషపూరితం చేసే హానికర రసాయనాలు, వ్యర్థాలను నీటిలోకి వదలవద్దు. వ్యవసాయంలో ఎక్కువగా రసాయన ఎరువులు, పురుగు మందులు వాడటం జల కాలుష్యానికి దారితీస్తుంది.

వాహనాల నుంచి వెలువడే కాలుష్యం, ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లు, ఏసీలు, మొబైల్ ఫోన్లు, 5జీ టవర్లు, కంప్యూటర్లు, టీవీల వాడకంతో పర్యావరణం వేడెక్కుతోంది. అందుబాటు దూరాలకు వాహనాల వినియోగం తగ్గించుకోవాలి. తప్పని సరిగా ప్రయాణం చేయాల్సిన సందర్భాల్లో ప్రజారవాణా సౌకర్యాలు వాడుకోవాలి. ఎక్కువ నడిస్తే ఆరోగ్యానికి మేలు జరుగుతుంది.

# డెంగీ పంజా

సంగారెడ్డి : వర్షాకాలం.. వానలతో పాటు వ్యాధులనూ తీసుకొచ్చింది. కొన్ని రోజులుగా జిల్లాలో డెంగీ కేసులు నమోదవుతున్న తీరు ఆందోళనకరంగా ఉంది. ప్రధానంగా జహీరాబాద్ డివిజన్‌లో ఎక్కువ మంది డెంగీ బారిన పడుతుండటంతో వైద్యారోగ్యశాఖ అప్రమత్తమయింది. వైద్య శిబిరాల నిర్వహణతో పాటు స్థానిక పంచాయతీలు, మున్సిపాలిటీల అధికారులతో కలిసి ప్రజలకు పారిశుద్ధ్యంపై అవగాహన కల్పిస్తున్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచిస్తున్నారు.

**అధ్వానంగా పారిశుద్ధ్యం.. కనిపించని ఫాగింగ్**

జిల్లాలో 647 గ్రామ పంచాయతీలున్నాయి. పంచాయతీ పాలకవర్గాలు లేకపోవడంతో ప్రత్యేకాధికారులు పల్లెల పాలనను పట్టించుకోవడం లేదనే విమర్శలొస్తున్నాయి. ఖాళీ కొబ్బరి బోండాలను నిల్వ ఉంచడం, పాత టైర్లు, ఇళ్లలోని డ్రమ్ముల్లో ఎక్కువ కాలం నీరు నిలిచి ఉండటంతో దోమలు వృద్ధి చెంది ప్రజలను కాటేస్తున్నాయి. డెంగీ జ్వరాలకు కారణమవుతున్నాయి. ముసురు వానలు కురుస్తుండటంతో పల్లెల్లో పారిశుద్ధ్య నిర్వహణ గాడి తప్పింది. జిల్లాలోని సంగారెడ్డి, జోగిపేట-అందోలు, సదాశివపేట, అమీన్‌పూర్, ఐడీఏ బొల్లారం, తెల్లాపూర్, జహీరాబాద్, నారాయణఖేడ్ పురపాలికల పరిధిలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. అన్ని పట్టణాల్లోనూ దోమల నివారణకు వినియోగించే ఫాగింగ్ యంత్రాలను పురపాలక అధికారులు మూలన పడేశారు. కమిషనర్లు నిత్యం వార్డులో తిరిగి పారిశుద్ధ్యాన్ని పర్యవేక్షించాల్సి ఉండగా.. ఆ దిశగా చర్యలు కరవయ్యాయి.

ప్రజలు జాగ్రత్తలు పాటించాలి:

గాయత్రీదేవి, జిల్లా ఇన్‌ఛార్జి వైద్యాధికారిణి

జిల్లావ్యాప్తంగా డెంగీ కేసులు నమోదవుతున్న నేపథ్యంలో వైద్యారోగ్యశాఖ అప్రమత్తమయింది. ఇందుకు అనుగుణంగా ప్రత్యేక విభాగం పనిచేస్తోంది. ఉప వైద్యాధికారులు నిత్యం పరిధిలోని పీహెచ్‌సీల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఎక్కడైనా డెంగీ కేసులు నమోదైతే వెంటనే వైద్య శిబిరాల నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నారు. ఆసుపత్రుల్లో మందుల కొరత లేదు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలి. జ్వరంగా ఉంటే వెంటనే పరీక్షలు చేయించుకోవాలి. సొంత వైద్యం సరికాదు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలి. కొబ్బరి బోండాలు, పాత టైర్లను వెంటనే పడేయాలి. వర్షం నీరు నిల్వ ఉండకుండా తగిన ఏర్పాట్లు చేసుకోవాలి. దోమలు కుట్టకుండా తెరలు వాడాలి. డ్రమ్ములు, ట్యాంకులను రెండు, మూడు రోజులకోసారి శుభ్రం చేయాలి. నిల్వ చేసిన ఆహార పదార్థాలు తినవద్దు.

**జహీరాబాద్ డివిజన్‌లో ఆందోళనకరం**

జహీరాబాద్ డివిజన్ పరిధిలో వారం వ్యవధిలోనే 14 డెంగీ కేసులు నమోదయ్యాయి. తాజాగా జహీరాబాద్ మండలం కొత్తూర్(బి)లో ఒకే ఇంట్లో నలుగురు డెంగీ బారినపడ్డారు. అప్రమత్తమైన వైద్యారోగ్యశాఖ అధికారులు గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఇంటింటికీ వెళ్లి పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. మొగుడంపల్లి మండలం లేతమామిడి తండాలోనూ ఒకే ఇంట్లో నలుగురు తీవ్ర జ్వరాలతో బాధపడ్డారు. వైద్య పరీక్షల చేయించుకోగా ఒకరికి డెంగీ నిర్ధారణ అయింది. న్యాల్‌కల్ మండలం మామిడ్గిలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు చిన్నారులు డెంగీ బారినపడ్డారు.

# ఆయకట్టులో జలపట్టు..!



నల్గొండ : నాగార్జునసాగర్ ఎడమ కాల్వ ఆయకట్టు సజీవం కానుంది. ప్రస్తుతం కృష్ణా బేసిన్‌లో పరిస్థితులు చూస్తే నాలుగైదు రోజుల్లో భారీ వరద సాగర్‌ను తాకనుంది. ఎగువ కృష్ణా పరివాహక ప్రాంతాల్లో పడుతున్న భారీ వర్షాలతో కర్ణాటక ప్రాజెక్టులు ఇప్పటికే నిండుకుండలుగా మారగా.. పైనుంచి వచ్చిన నీటిని వచ్చినట్లే దిగువకు వదులుతున్నారు. శ్రీశైలం జలాశయానికి 3.60 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. ప్రాజెక్టు నీటిమట్టం 129.0 టీఎంసీలకు (పూర్తి సామర్థ్యం 215.81 టీఎంసీలు) చేరింది. వరద ఇలాగే కొనసాగే అవకాశం ఉండటంతో.. మరో మూడు రోజుల్లో శ్రీశైలం ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టానికి చేరుకునే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. మరోవైపు కృష్ణా నది జన్మస్థానమైన సహ్యాద్రి పర్వతాలతో పాటూ మహారాష్ట్రలోని కొల్హాపూర్, సతారా, సాంగ్లి తదితర ప్రాంతాల్లో భారీ వర్షాలు పడుతున్న దృష్ట్యా ప్రస్తుతం శ్రీశైలం జలాశయానికి వస్తున్న వరద వారం పాటూ కొనసాగే అవకాశం ఉందని నీటిపారుదల శాఖ అధికారి ఒకరు వెల్లడించారు. దీంతో శ్రీశైలం నుంచి నేరుగా వరద జలాలు సాగర్ ప్రాజెక్టును చేరనున్నాయి. సాగర్ ప్రాజెక్టు వద్ద 36 వేలకు పైగా క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతోంది. ఒకట్రెండు రోజుల్లో శ్రీశైలం పవర్‌హౌస్‌ల నుంచి సైతం విద్యుతుత్పత్తి ద్వారా నీటిని దిగువకు వదలనున్నారు. కర్ణాటకలో భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని కేంద్ర జలవనరుల శాఖ ఆదేశించిన నేపథ్యంలో అత్యవసరం అయితే ఒకట్రెండు రోజుల్లోనే శ్రీశైలం క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదలకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఏ రకంగా చూసినా ఆగస్టు ఒకటో తేదీ కంటే ముందుగానే కృష్ణమ్మ వరద రెండు రాష్ట్రాల వరప్రదాయినిని తాకే అవకాశం ఉంది.

**ఐదు లక్షల ఎకరాల్లో సాగుకు అనుకూలం**

గతేడాది సాగర్ ప్రాజెక్టులోకి ఆశించినంత మేర వరద చేరకపోవడంతో యాసంగిలో సుమారు 3.5 లక్షల ఎకరాలను రైతులు బీళ్లుగానే వదిలేశారు. ఈ ఏడాది జులై ఆఖరులోనే శ్రీశైలం ప్రాజెక్టు నిండుతుండటం, ఎగువ ఆశాజనక పరిస్థితులు ఉండటంతో ఎడమ కాల్వ కింద నల్గొండ, సూర్యాపేట జిల్లాలోని 3.5 లక్షల ఎకరాలు, ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు (ఏఎమ్మార్పీ) కాల్వ పరిధిలో 2.5 లక్షల ఎకరాల ఆయకట్టులో పంటల సాగుకు రైతులు సమాయత్తం అవుతున్నారు. ఇప్పటికే ఈ రెండు కాల్వల కింద బోరుబావులు ఉన్న రైతులు సుమారు లక్ష ఎకరాల్లో వరిని సాగు చేశారు. తాజా పరిణామాలతో మరో ఐదు లక్షల ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు కానుంది. దీంతో వ్యవసాయ అధికారులు సైతం అందుకు కావాల్సిన ఎరువుల కొరత లేకుండా నిల్వలపై దృష్టి పెట్టారు. రెండేళ్ల క్రితం ఆగస్టు ఒకటో తేదీన సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకోగా క్రస్ట్‌గేట్ల నుంచి నీటిని దిగువన ఉన్న టెయిల్‌పాండ్‌కు వదిలారు. తిరిగి ఇప్పుడు సాగర్ పూర్తిస్థాయి నీటామట్టానికి చేరే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

# పల్లె పోరులో కదలిక




వికారాబాద్: పంచాయతీ ఎన్నికలు వీలైనంత త్వరగా నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించడంతో జిల్లాలో ఒక్కసారిగా రాజకీయ సందడి నెలకొంది. బీసీ గణన పూర్తయ్యాకే ఎన్నికలు నిర్వహిస్తారన్న కోణంలో ఆలోచించి మరో ఆరు మాసాల పాటు జరగవనే అభిప్రాయంతో ఉన్న ఆశావహుల్లో ప్రభుత్వ నిర్ణయం కదలిక తీసుకువచ్చింది. దీంతో పోటీ చేయడానికి అనుగుణంగా తమ మద్దతుదారులతో సమాలోచనలకు తెర తీయడంతో రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది.

**కొనసాగుతున్న ప్రత్యేక అధికారుల పాలన**

జిల్లాలోని 20 మండలాల్లో 566 గ్రామ పంచాయతీలకు 2019 జనవరిలో మూడు దశల్లో ఎన్నికలు నిర్వహించారు. గత ఫిబ్రవరి 1 నుంచి పాలకవర్గాల గడువు ముగియడంతో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. రెండు పర్యాయాలు ఒకే రిజర్వేషన్ విధానం ఉండేలా గత ఎన్నికల్లోనే నూతన పంచాయతీరాజ్ చట్టాన్ని తీసుకొచ్చారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో పాత విధానాన్నే కొనసాగిస్తారా? ఏవైనా మార్పులు చేస్తారా అనే అంశంపై స్పష్టత రావాల్సి ఉంది. బీసీ ఓటర్ల సంఖ్య పెరగడంతో రిజర్వేషన్లలో మార్పులు చోటు చేసుకునే అవకాశం ఉన్నట్లు పంచాయతీరాజ్ శాఖ అధికారులు భావిస్తున్నారు. అయితే బీసీ గణన ప్రకారం రిజర్వేషన్లను పెంచే అవకాశం లేకపోవడంతో పాత విధానాన్నే కొనసాగించే వీలుందని ప్రజా ప్రతినిధులు పేర్కొంటున్నారు.

జిల్లాలో 18 జడ్పీటీసీ, 221 ఎంపీటీసీ స్థానాలున్నాయి. జులై 4న పదవీకాలం ముగిసింది. వీటికి కూడా సర్పంచులకు మాదిరిగానే రెండు పర్యాయాలు రిజర్వేషన్ అమల్లో ఉంది. రెండు మాసాల వ్యవధిలో సర్పంచి, ప్రాదేశిక ఎన్నికలు జరిగే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో ఆశావహులు ఇప్పటికే ఓటర్లను తమ వైపు తిప్పుకునే ప్రయత్నాలు ప్రారంభించారు.

**మండలాల వారీగా పంచాయతీలు**

వికారాబాద్- 21, మర్పల్లి- 27, బంట్వారం- 11, కోట్‌పల్లి- 18, మోమిన్‌పేట- 28, ధారూర్- 32, నవాబుపేట- 32, తాండూర్- 33, పెద్దేముల్- 37, యాలాల్- 37, బషీరాబాద్- 36, పరిగి- 37, పూడూర్- 31, దోమ- 36, కుల్కచర్ల- 44, కొడంగల్- 26, బొంరాస్‌పేట- 47, దౌల్తాబాద్- 33.

**వాస్తవానికి గతంలోనే ఏర్పాట్లు**

గతేడాది డిసెంబరులోనే సర్పంచి ఎన్నికలకు రిటర్నింగ్ అధికారులు, ప్రిసైడింగ్, పోలింగ్ అధికారులు, సిబ్బందిని నియమించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలను జారీ చేసింది. లోక్‌సభ ఎన్నికలు రావడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది.

200 మంది ఓటర్లకు ప్రిసైడింగ్ అధికారితో పాటు పోలింగ్ అధికారి ఉంటారు.

201- 400 మంది ఓటర్లకు ఒక ప్రిసైడింగ్ అధికారి, ఇద్దరు పోలింగ్ అధికారులు, 401- 650 వరకు ప్రిసైడింగ్ అధికారి, ముగ్గురు పోలింగ్ అధికారులు ఉంటారు.

650 మంది ఓటర్ల కంటే ఎక్కువ ఉంటే అదనపు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తారు.

మొత్తం జిల్లా జనాభా: 12.50 లక్షలు


మండలాలు: 20

పంచాయతీలు: 566

నిర్వహణకు సిద్ధంగా ఉన్నాం జయసుధ, జిల్లా పంచాయతీ అధికారి

గ్రామ పంచాయతీ ఎన్నికలు ఎప్పుడొచ్చినా నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నాం. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు జాబితా రూపకల్పన, పోలింగ్, లెక్కింపు కేంద్రాలు, ఎన్నికల అధికారుల నియామకం తదితర ఏర్పాట్లపై దృష్టి సారిస్తున్నాం.

# చీకటి వాకిట్లో పేదల గూళ్లు



హైదరాబాద్ : పేదలకు అందజేసిన రెండు పడక గదుల ఇళ్లు చీకట్లో మగ్గుతున్నాయి. లబ్ధిదారులకు పంపిణీ చేసి ఏడు నెలలవుతున్నా.. విద్యుత్తు పనులు పూర్తవలేదు. కొన్నిచోట్ల పనులు ప్రారంభమే కాలేదు. మరోవైపు లక్ష ఇళ్లలో 30శాతం ఇంకా పూర్తి కాలేదు. నిధుల సమస్యతో రెండేళ్లుగా జీహెచ్‌ఎంసీ గుత్తేదారులకు బకాయిలు చెల్లించలేదు. దీంతో కాంట్రాక్టర్లు పనులను పూర్తిగా ఆపేశారు. బకాయిలు, కావాల్సిన నిధులపై నివేదిక ఇచ్చామని జీహెచ్‌ఎంసీ చెబుతోంది.

**మూసీ అభివృద్ధికి అవసరం..**

నగరంలో లక్ష రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాన్ని గత సర్కారు 2017లో చేపట్టింది.ఇప్పటివరకు 69,673 ఇళ్లు పూర్త య్యాయి. మురికివాడల్లోని గుడిసెలను తొలగించి ఆ స్థలంలో 4,590 ఇళ్లు నిర్మించారు. వాటన్నింటినీ గత సర్కారు లాటరీ పద్ధతిలో గతేడాది లబ్ధిదారులకు అందించింది. మిగిలిన 30,327 ఇళ్ల నిర్మాణాన్ని మాత్రం విస్మరించారు. ప్రస్తుతం మూసీ నది అభివృద్ధి పనులు పట్టాలెక్కాయి. నది లోపల ఉన్న 15వేల ఇళ్లను తొలగించాల్సి ఉంటుంది. ఆయా నిర్వాసితులకు రెండు పడక గదుల ఇళ్లను ఇవ్వాలన్నది ప్రభుత్వం ఆలోచన. కానీ.. ఇళ్లు మాత్రం సిద్ధంగా లేవు. అవసరమైన రూ.2,600కోట్లను సర్కారు విడుదల చేస్తేనే పనులు తిరిగి మొదలవుతాయి.

**వసతులు లేకుండా.. అప్పగించారు..**

ఇళ్లకు తాగునీరు, విద్యుత్తు సరఫరా పూర్తయిందా? లేదా? అనే విషయాలను పరిగణనలోకి తీసుకోకుండా లబ్ధిదారులకు ఇళ్లు అప్పగించారు. మురుగునీటి కనెక్షన్లు, తాగునీటి సరఫరా పనులు ఇటీవల కొలిక్కి వచ్చినట్టు సమాచారం. 12 ప్రాంతాల్లోని 9,196 ఇళ్లలోనే లబ్ధిదారులు చేరారు. మరో ఆరు ప్రాంతాల్లోని 26,156 ఇళ్లలో ఇటీవల మౌలిక సౌకర్యాల కల్పన పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. 24 ప్రాంతాల్లోని 28,319 ఇళ్లు చీకట్లో మగ్గుతున్నాయి.

# పేదల కల నెరవేరేనా?

వేములవాడ : ఆధ్యాత్మిక పట్టణమైన వేములవాడలో నిరుపేదలకు సొంతింటి కల నెరవేరేటట్లు కనిపించడం లేదు. ఇళ్లు లేని వారికి రెండు పడక గదుల ఇళ్లు నిర్మించి ఇవ్వాలని భావించి గత ప్రభుత్వం నిర్మాణాలు చేపట్టింది. నిర్మాణ సామగ్రి ధరలు పెరిగిపోవడం, ప్రభుత్వం కేటాయించిన నిధులు చాలకపోవడంతో గుత్తేదారులు చేతులెత్తేశారు. దీంతో నిర్మాణాలు నిలిచిపోవడంతో నిరుపేదలు తీవ్ర నిరాశకు గురయ్యారు.వేములవాడ పట్టణానికి ఇతర ప్రాంతాల నుంచి అనేక మంది నిరుపేదలు వలస వస్తుంటారు. ఇందులో చాలా మంది ఇళ్లు అద్దెకు తీసుకొని నివాసం ఉంటూ వివిధ పనులు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. కొందరు గుడిసెల్లో కాలం వెల్లదీస్తున్నారు. వేములవాడ పట్టణంలో సొంతిళ్లు లేని కుటుంబాలు దాదాపు నాలుగు వేలు ఉన్నట్లు అంచనా. మొదటి విడతలో వేములవాడ పట్టణానికి గత ప్రభుత్వం 800 ఇళ్లను మంజూరు చేసింది. వీటి నిర్మాణాలకు ఒకే ప్రాంతంలో ప్రభుత్వ స్థలం అందుబాటులో లేకపోవడంతో పట్టణ శివారులోని ఆర్టీసీ బస్ డిపో ప్రాంతంలో



చింతల్‌ఠాణా కాలనీ వద్ద ప్రభుత్వ భూమిలో 144 ఇళ్ల నిర్మాణాలకు అయిదేళ్ల క్రితం శ్రీకారం చుట్టారు. మారుపాక రోడ్డులోని ప్రభుత్వ భూమిలో మరో 84 ఇళ్ల నిర్మాణానికి రంగం సిద్ధం చేసినప్పటికీ స్థలం వివాదాస్పదం కావడంలో అక్కడ పనులు మొదలు పెట్టలేదు. కేవలం 144 ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టి మధ్యలో వదిలేశారు. జిప్లస్ టులో ఒక్కొక్క బ్లాక్‌లో 12 ఇళ్లు ఉండే విధంగా పనులు మొదలు పెట్టారు. ఈ నిర్మాణాలు మూడేళ్లలో పూర్తి కావాల్సి ఉన్నప్పటికీ ఏళ్లుగా మూలుగుతున్నాయి.

అంచనాలు పెరగడంతో...

రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాలకు గత ప్రభుత్వం ఒక్కో ఇంటికి రూ. 5.4 లక్షలను కేటాయించింది. ఈ నిధులు సరిపోకపోవడంతో పనులు మధ్యలో నిలిచిపోయాయి. అగ్రిమెంట్ సమయంలో ఉన్న సామగ్రి ధరలు ఆ తరవాత అమాంతం పెరిగిపోవడంతో గుత్తేదారులు చేతులెత్తేశారు. అసెంబ్లీ ఎన్నికల ముందు కూడా టెండర్లు పిలిస్తే పనులు చేసేందుకు ఎవరు ముందుకు రాలేదు. దీంతో ఇళ్ల నిర్మాణ పనులు నిలిచిపోయాయి. మరోవైపు మిగతా ఇళ్ల నిర్మాణాలకు స్థల సమస్య ఏర్పడింది. దీంతో వాటి పనులు మొదలు పెట్టే పరిస్థితి కనిపించడం లేదు. నిర్మాణాలు ప్రారంభించిన 144 ఇళ్లు సైతం పూర్తి చేస్తారన్న నమ్మకం లేకుండా పోయింది. పట్టణంలో చాలా మంది నిరుపేదలు తమకు రెండు పడక గదుల ఇళ్లు వస్తాయన్న ఆశతో గత కొన్నాళ్లుగా ఎదురుచూస్తోన్నారు. ఇప్పటికైనా మధ్యలో నిలిచిపోయిన ఇళ్లను పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని నిరుపేదలు కోరుతున్నారు.

ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రాలేదు

రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు కొత్త ప్రభుత్వంలో ఇప్పటి వరకు ఎలాంటి మార్గదర్శకాలు రాలేదు. నిర్మాణ సామగ్రి ధరలు పెరిగిపోవడంతో గతంలో అనేక సార్లు పనులు చేపట్టేందుకు టెండర్లు పిలిచినప్పటికీ గుత్తేదారులు ముందుకు రాలేదు. వాటిపై ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు వస్తే పనులు చేపట్టేందుకు అవకాశం ఉంటుంది. సతీశ్, ఏఈ, ఆర్‌అండ్‌బీ, వేములవాడ

# వరిపై ఆశలు సన్నగిల్లకుండా..

ఖమ్మం : కేంద్ర ప్రభుత్వం ఇటీవల పలు పంటలకు మద్దతు ధరను పెంచింది. ప్రధాన పంట వరికి క్వింటాకు రూ.117 పెంచారు. ఈ సీజన్ నుంచి కామన్ రకం (గ్రేడ్ ఏ) ధాన్యం ధర రూ.2,203 నుంచి రూ.2,320కి చేరనుంది. దీనివల్ల ఉమ్మడి జిల్లా రైతులకు కాస్తైనా ఊరట కలగనుంది. రాష్ట్ర ప్రభుత్వం అదనంగా ప్రకటించిన రూ.500 బోనస్‌పై రైతులు, ముఖ్యంగా కౌలురైతులు గంపెడాశలు పెట్టుకున్నారు.ఖమ్మం జిల్లాలో అత్యధిక విస్తీర్ణంలో వరి సాగవుతోంది. దీని సాధారణ సాగు విస్తీర్ణం 2,83,943 ఎకరాలు. జిల్లాలో 50 శాతం మంది రైతులు దొడ్డు రకాలు సాగు చేస్తున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే వీరు పంటను విక్రయిస్తూ వస్తున్నారు. తాజాగా కేంద్ర ప్రభుత్వం పెంచిన మద్దతతో ఎంతో కొంత ఊరట దక్కినా, ఈ సీజన్ నుంచి సన్నాలు క్వింటాకు రూ.500 బోనస్ వర్తింపజేస్తామన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రకటనపైనే రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో చూస్తే.. వానాకాలంలో సగటున 1.60 లక్షల ఎకరాల్లో వరి సాగవుతోంది. కిన్నెరసాని, తాలిపేరు, మూకమామిడి ప్రాజెక్టులతో పాటు మొర్రేడువాగు, పాములేరు, కిన్నెరసాని, గోదావరి తదితర నదుల పరీవాహకం, చెరువులు, బోరుబావులు ఆధారంగా సాగవుతున్న వాటిల్లో దొడ్డు రకాలు ఎక్కువే. తక్కువ పెట్టుబడి, దిగుబడి ఆశించినంత ఉండటం, ప్రభుత్వం కొనుగోలు చేస్తుండటంతో ఈ రకాల వైపు ఇక్కడి రైతులు మొగ్గుచూపుతున్నారు. చీడపీడలు, మందుల ఖర్చుల కారణంగా సన్నాల సాగుతో ఆశించిన ఫలితం ఉండటం లేదని రైతులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో కేంద్రం ఇంతకు మించి మద్దతు ఇవ్వాలని, సన్నాలు, దొడ్డు అనే తేడాల్లేకుండా అన్నింటికీ రాష్ట్ర ప్రభుత్వం బోనస్ ఇవ్వాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. బయట మార్కెట్‌లో వ్యాపారులు మద్దతు ధరకు తక్కువగా కొనుగోళ్లు చేపట్టకుండా నియంత్రించాల్సిన అవసరం ఉంది.పెట్టుబడి మరింత భారం..

దుక్కులు, విత్తనాలు, నాట్లు, కలుపునివారణ, ఎరువులు, పురుగుమందులు, వరికోత యంత్రాలకు ఎకరాకు సగటున రూ.30 వేల నుంచి రూ.35 వేల ఖర్చు వస్తుందన్నది రైతుల లెక్క. సన్నాలైతే 20 నుంచి 24 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. సగటున 22 క్వింటాళ్ల చొప్పున వేసుకుంటే పెరిగిన మద్దతు ధర ప్రకారం ఎకరా మొత్తం రూ.50 వేల ఆదాయం ఉంటుంది. ప్రకృతి వైపరీత్యాలు, కరవు పరిస్థితులు, చీడ పీడల్లేకుండా దిగుబడి ఆశాజనకంగా ఉంటే రైతుకు మిగిలేది (ఎకరాకు) గరిష్ఠంగా రూ.15 వేలే. లేదంటే పైసా రాకున్నా భూతల్లికి రెక్కల కష్టాన్ని ధారబోసినట్లే. ఉమ్మడి జిల్లాలో ఏటా లక్షల ఎకరాలను కౌలు రైతులు సాగుచేస్తున్నారు. వీరు పెట్టుబడికి తోడు ఎకరాకు రూ.20 వేల నుంచి రూ.25 వేల చొప్పున యజమానికి కౌలు చెల్లిస్తున్నారు. దీంతో అత్యధికులు నష్టాల్నే మూటగట్టుకుంటున్నారు. ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోతే అప్పులపాలవుతున్నారు. మద్దతు ధర, బోనస్‌లను వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని నిర్ణయించాలన్నది రైతులు, రైతు-కూలీ సంఘాల డిమాండ్. లేదంటే సాగు విస్తీర్ణం అంతకంతకూ పడిపోవం ఖాయమని చెబుతున్నారు.

# పూత రాలి.. తెగుళ్లు పెరిగి

మెదక్ : మామిడికి ఏటా తెగుళ్ల బెడద పట్టిపీడిస్తోంది. నవంబర్, డిసెంబర్‌లో చలి తీవ్రత, తేనె మంచు, బూడిద, నల్లతామర తెగుళ్ల సమస్య ఉంటోంది. దీంతో ఈసారి మామిడి దిగుబడి గణనీయంగా తగ్గిపోయింది. దీనికి తోడు దళారుల బెడద రైతులను వేధిస్తోంది. అందువల్ల సాగు రైతులతో పాటు కౌలుదారులు రూ.లక్షల్లో నష్టపోతున్నారు. మొదటిదశ పూతకు సంబంధించిన కాయలు తెంపడం కొనసాగుతోంది. మలి విడత కాయలను మరో పక్షం రోజుల్లో కోయనున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వపరంగా మామిడి కొనుగోలు చేపట్టి దళారుల నుంచి నష్టం రాకుండా చూడాలని రైతులు సంబంధిత అధికారులను, ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

జిల్లా వ్యాప్తంగా 2500–3000 ఎకరాల్లో మామిడి తోటలు సాగవుతున్నాయి. సాగులో మొదటి దశలో వివిధ తెగుళ్లతో కొంతమేర పూత, పిందెలు రాలిపోయాయి. వాతావరణ పరిస్థితులను తట్టుకొని నిలిచిన పూతకు సంబంధించి రైతులు ముందు జాగ్రత్తలు తీసుకోవడంతో కొంతమేర దిగుబడులు వచ్చాయి. మొదటిదశ పూత ద్వారా కాసిన కాయలు ప్రస్తుతం తెంపుతున్నారు. ఇంకో వారం, పది రోజుల్లో ఇవి పూర్తికానున్నాయి. రెండో దశ పూతలో తెగుళ్ల తట్టుకొని దాదాపు 60 శాతం నిలవడంతో ప్రస్తుతం వాటి కాయలు ఉన్నాయి. ఇవికూడా మరో 15 రోజుల్లో తెంపనున్నారు.

దళారుల ఇష్టారాజ్యం

ప్రస్తుతం మార్కెట్‌లో మామిడి కిలోకు రూ.80–90 పలుకుతోంది. జిల్లాలో తక్కువ విస్తీర్ణంలో సాగవుతున్న పంట కావడంతో ఏటా హైదరాబాద్‌తో పాటు ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంటారు. కానీ ఈ ఏడాది కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో సైతం



దిగుబడులు తక్కువగా ఉండడంతో ఇప్పట్లో ధరలు తగ్గే అవకాశం లేదు. మరోవైపు మామిడి రైతులకు దళారుల బెడద తప్పడం లేదు. వీరు నిర్ణయించిన ధరకే విక్రయించాలి. లేకపోతే కొనుగోలు చేసేవారు లేకుండా పోతారని రైతులు వాపోతున్నారు.

రూ.20 లక్షల పెట్టుబడి పెట్టాం

– సాయిలు, కౌలు రైతు, వ్యాపారి

గత 15 ఏళ్ల నుంచి పండ్ల వ్యాపారం చేస్తున్నాను. రెండేళ్ల నుంచి పలు రకాల తెగుళ్ల కారణంగా మామిడి దిగుబడి తగ్గింది. ఈ ఏడాది అయినా ఆశించిన స్థాయిలో దిగుబడి వస్తుందని మెదక్–కామారెడ్డి జిల్లాలో రూ.20 లక్షలు పెట్టుబడి పెట్టి 40 ఎకరాల మామిడి తోటలను కౌలుకు తీసుకున్నాం. కానీ తేనె మంచు తెగుళ్ల వల్ల పూత రాలిపోయి కాత తగ్గింది. ఇప్పుడే కోతలు ప్రారంభించగా, ఆశించిన స్థాయిలో దిగుబడి రావడం లేదు. ఈ ఏడాది సైతం నష్టపోయే అవకాశాలు ఉన్నాయి.

అవగాహన కల్పించాం

– నర్సయ్య, జిల్లా ఉద్యానశాఖ అధికారి


తెగుళ్లు పూతను తినేస్తున్న విషయం తెలియగానే పలు మామిడి తోటలను సందర్శించి రైతులకు తగు సూచనలు చేశాం. పూత దశలో వచ్చే తెగుళ్ల నివారణకు ఉద్యానశాఖ అధికారులు చెప్పే సూచనలు పాటించాలి. సాధారణంగా పూసిన పూతలో 90శాతం రాలిపోగా మిగిలిన 10శాతమే కాయలు కాస్తాయి. కానీ ఈ ఏడాది కేవలం 2శాతం పూత మాత్రమే మిగలడంతో దిగుబడి తగ్గింది. జిల్లా వ్యాప్తంగా 90 వేల టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉంది.

# వాడిన విరులూ.. ఆదాయపు సిరులే

శివ్వంపేట: అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటే సత్ఫలితం ఖాయం. ఈ కోవకే చెందుతారు మెదక్ జిల్లా శివ్వంపేట మండలం ఎదుల్లాపూర్ గ్రామానికి చెందిన మహిళలు. వాడిన పూలతో అగర్‌బత్తీలు తయారుచేస్తూ స్వయం ఉపాధి పొందుతూ ఆదాయాన్ని ఆర్జిస్తుండటం విశేషం. గ్రామంలో ఇటీవల సెహగల్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ గ్రామంలో స్వయం ఉపాధి పొందే తీరుపై అవగాహన కల్పించింది. అందుబాటులో ఉన్న వనరులు, అవకాశాల ను సంస్థ ప్రతినిధులు వివరించారు. దీంతో గ్రామానికి చెందిన భూరెడ్డి పెద్ద పద్మ, చిన్న పద్మ, లావణ్య, కల్పనలు అడుగు ముందుకేశారు. వినియోగించిన పూలతో అగర్‌బత్తీలను తయారు చేసేందుకు ముందుకొచ్చారు.

సంస్థ సహకారంతో..: సదరు మహిళలకు సెహగల్ ఫౌండేషన్ అన్ని రకాలుగా సహకారం అందించేందుకు ముందుకొచ్చింది. రూ.1.50 లక్షలు ఇవ్వగా.. నలుగురు కలిసి రూ.1.20 లక్షలు జమచేసుకున్నారు. వీటితో అగర్‌బత్తీలు తయారీ యంత్రం, ముడి సరకులు కొనుగోలు చేసి కుటీర పరిశ్రమ తరహాలో ఏర్పాటుచేసుకున్నారు. అగర్‌బత్తీల తయారీ విధానంపై మహిళలకు సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. రెండు నెలల కిందట తయారీని షురూ చేశారు.

ఆలయాల్లో వినియోగించిన పూలతో..: ఈ మహిళలు ముందుగా మండలంలోని ఆలయాల్లో దేవుళ్లకు వినియోగిస్తున్న పూలను సేకరిస్తున్నారు. చిన్నగొట్టిముక్ల పరిధిలోని చాకరిమెట్ల సహకార ఆంజనేయ స్వామి, శివ్వంపేటలోని బగలాముఖి



శక్తిపీఠం తదితర ఆలయాల నుంచి వినియోగించిన పూలను తీసుకొస్తున్నారు. వాటిని బాగా ఎండబెట్టి పొడిగా మారుస్తున్నారు. ఎలాంటి రసాయనాలు వాడకుండా అగర్‌బత్తీలను యంత్రం సాయంతో తయారుచేస్తున్నారు. వీటి విక్రయానికి సెహగల్ ఫౌండేషన్ సహకారం అందిస్తోంది. ప్రస్తుతం స్థానికంగా విక్రయిస్తున్నారు. త్వరలోనే యాదగిరిగుట్ట, ఇతర పెద్ద ఆలయాల్లో విక్రయించేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయి. ఈ విషయమై సెహగల్ ఫౌండేషన్ ప్రతినిధి వేమ నారాయణ మాట్లాడుతూ.. మహిళలు ముందుకు వస్తే సంస్థ ద్వారా ఉపాధి మార్గాలు చూపించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

# పుడమికి బలం.. జగతికి జీవాధారం



తాండూరు : తాగునీటి ఎద్దడి నివారణకు, భూగర్భ జలాల పెంపుదలకు 'ఇంకుడు గుంతలకు' మించిన చక్కటి మార్గం మరొకటి లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొన్నేళ్ల క్రితం వరకు వీటి తవ్వకానికి ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చి ప్రోత్సహించాయి. కరవు పరిస్థితులను అధిగమించేందుకు ఇవి ఎంతో ఉపయోగపడతానికి ప్రధానంగా మున్సిపాలిటీల్లో ప్రజలు సైతం చొరవ చూపారు. తరువాత దీనిపై అటు ప్రభుత్వం ఇటు ప్రజలు ఆసక్తి చూపక పోవడంతో ఉన్నవన్నీ పూడుకుపోయి ఆనవాళ్లే కానరాకుండా పోయాయి. ప్రస్తుతం ఎండలు భరించలేని స్థితిలో ఉన్నాయి. చెరువులు, కుంటలు అడుగంటి పోతున్నాయి. ఇలాంటి తరుణంలో మళ్లీ కరవు పరిస్థితులు తలెత్తకుండా పట్టణాల్లో అందరూ 'ఇంకుడు గుంతల' తవ్వకానికి ముందుకు రావాల్సిన అవసరం ఉంది. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో వీటి అవసరం, గత పరిస్థితులపై కథనం.

నిబంధనల అమలు ఎక్కడ..

జిల్లాలో పరిగి, తాండూరు, కొడంగల్, వికారాబాద్ మున్సిపాలిటీలున్నాయి. వీటిలో కొత్తగా భవనాల నిర్మాణాలు చేసే వారు ఇంకుడు గుంతను విధిగా నిర్మించుకోవాలనే నిబంధన ఉంది. అధికారులు మాత్రం ఇళ్ల నిర్మాణానికి అనుమతులు ఇచ్చి చేతులెత్తేస్తున్నారు. ఫలితంగా వర్షాకాలంలో ఇంటి పరిసరాల్లో పారుతున్న వరద వృథాగా పోతుంది. దీనికి తోడు గృహాల్లో వివిధ అవసరాలకు వినియోగించిన నీరు కూడా కాలువల ద్వారా వెళ్లి పోతుంది. ప్రభుత్వ కార్యాలయాల్లో గతంలో నిర్మించిన ఇంకుడు గుంతల నిర్వహణ సవ్యంగా లేక భూమికి సమాంతరంగా మారి పోయాయి.

2019లోనే లక్ష్య నిర్దేశం

నిర్ణీత పరిమాణాల్లో తవ్విన గుంతల్లో కంకర, ఇసుక, గులకరాళ్లను పొరలుగా పోస్తారు. వీటిలోకి వచ్చిన వరద నీరు, వృథా నీరు భూమిలోకి ఇంకి పోయి జల మట్టం పెరుగుతుంది. ఈ అంచనాతో జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో కలిపి 2019–20 ఆర్థిక సంవత్సరంలో 2,560 ఇంకుడు గుంతలు నిర్మించాలనే లక్ష్యాన్ని మున్సిపాలిటీలు పెట్టుకున్నాయి. ఒక్కో ఇంకుడు నిర్మాణ స్థితిని బట్టి రూ.6వేల నుంచి రూ.8వేల వరకు చెల్లించేందుకు నిర్ణయించింది. అయితే ఈ విషయంలో అవగాహన కల్పించక పోవడంతో నిర్ణీత లక్ష్యం ఇప్పటికీ నెరవేరలేదు.

ఒక్కో మున్సిపాలిటీలో ఇవి పరిమిత సంఖ్యలోనే పూర్తవడం విశేషం.

ప్రత్యేక శిలాఫలకం ఆవిష్కరించినా..

తాండూరులో ఇంకుడు గుంతల నిర్మాణానికి 2017లో అప్పటి ప్రభుత్వం రూ.4లక్షలను మంజూరు చేసింది. అదే ఏడాది జనవరి 30న అప్పట్లో రవాణా శాఖ మంత్రిగా ఉన్న పట్నం మహేందర్‌రెడ్డి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ నిధుల ఆధారంగా ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల ఆవరణల్లో దాదాపు 67 ఇంకుడు గుంతలను నిర్మించాల్సి ఉండగా పట్టించుకోలేదు. నిధులు వెనక్కి వెళ్లి పోయాయి. శిలాఫలకం మాత్రం వెక్కిరిస్తోంది.

# ఆడిటోరియంగా సినారె కళా మందిరం



వేములవాడ : ఆధ్యాత్మిక పట్టణమైన వేములవాడ ప్రాంతంలో కళలను, కళాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో పట్టణంలోని తెలంగాణ కూడలి వద్ద మండల పరిషత్ కాంపెక్స్‌లో నిర్మించిన సినారె కళా మందిరాన్ని ఆడిటోడిరియంగా మార్చడానికి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగా ఉన్న భవనానికి మార్పులు, చేర్పులు చేసేందుకు అంచనాలు రూపొందిస్తున్నారు.

అధికారుల నిర్లక్ష్యం, ప్రజా ప్రతినిధుల అలసత్వం కారణంగా సినారె కళా మందిరం కళావిహీనంగా మారింది. దీనిని మండల పరిషత్ నుంచి మున్సిపల్‌కు అప్పగించడంతో మున్సిపల్ చెత్త ఆటోలకు నిలయమైంది. జ్ఞానపీఠ అవార్డు గ్రహీత, రాజ్యసభ మాజీ సభ్యుడు దివంగత సింగిరెడ్డి నారాయణరెడ్డి (సినారె) తన నిధుల నుంచి రూ.50 లక్షలు కేటాయించడంతో అన్ని హంగులతో విశాలమైన భవనాన్ని నిర్మించి 2002లో ప్రారంభించారు. ఏదేని సమావేశం నిర్వహిస్తే దాదాపు వేయి మంది కూర్చోవడానికి వీలుగా కట్టారు. అప్పటి నుంచి ఇది కళాకారులకు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలకు వేదికగా నిలిచింది. క్రమంగా ఈ భవనాన్ని పట్టించుకునే నాథుడు లేకపోవడంతో కళావిహీనంగా మారింది. రెండేళ్ల క్రితం ఈ భవనాన్ని మున్సిపల్‌కు అప్పగించారు. దీంతో ఆవరణలో చెత్త ఆటోలు పెట్టడానికి వినియోగిస్తున్నారు. దీనిని పూర్తిగా తొలగించి రూ.5 కోట్లతో నూతన భవనం నిర్మించాలని గత ప్రభుత్వ హయాంలో ప్రతిపాదనలు చేయగా నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. తరవాత నిధులు విడుదల కాకపోవడంతో పనులు మొదలు పెట్టలేదు. ఈ భవనం నిర్మించి తక్కువ కాలం కావడంతో దానిని అలాగే ఉంచి ఆడిటోరియంగా మార్చడానికి అధికారులు ప్రస్తుతం ప్రణాళికలు తయారు చేస్తున్నారు.

మరమ్మతులతో పూర్వ వైభవం

సినారె కళామందిరం నిర్మించి దాదాపు 22 ఏళ్లు అవుతుంది. దీనిని వినియోగించుకునేందుకు అవకాశం ఉంది. ప్రస్తుతం భవనంలో సీలింగ్ ఊడి పోవడం, విద్యుత్తు వైరింగ్ పాడవ్వడం, తలుపులు, కిటికీల అద్దాలు పగిలిపోవడం వంటివి జరిగాయి. ఈ భవనానికి మరమ్మతులు చేస్తే పూర్వ వైభవం సంతరించుకోనుంది. గతంలో ఇందులో సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ సందర్భాల్లో పెద్ద ఎత్తున సమావేశాలు జరిగేవి. జిల్లా స్థాయిలో పలు మార్లు జాతీయ యువజన దినోత్సవాలు నిర్వహించారు. ఎన్నికల సందర్భంలో ఎన్నికల సామగ్రి నిల్వ చేసేందుకు వినియోగించేవారు. వివిధ ప్రభుత్వ కార్యక్రమాలను ఇందులో నిర్వహించారు. అనేక రకాలుగా ఉపయోగపడే ఈ భవనాన్ని గత కొన్నాళ్లుగా పట్టించుకునే నాథుడు లేక అపరిశుభ్రంగా మారింది. రాత్రి సమయంలో మందుబాబులకు అడ్డాగా మారింది. ఇప్పటికైనా అధికారులు ఆడిటోరియంగా మార్చి వినియోగంలోకి తీసుకొస్తే కళాకారులు, పట్టణవాసులకు ఉపయోగపడనున్నది.

ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం

ప్రస్తుతం ఉన్న భవనం స్థానంలో కొత్తది నిర్మాణానికి రూ.5 కోట్లు మంజూరు ఉత్తర్వులు వచ్చినప్పటికీ నిధులు విడుదల కాలేదు. అందువల్ల పనులు చేపట్టలేదు. ప్రస్తుతం ఉన్న భవనానికి మార్పులు, చేర్పులు చేసి ఆడిటోరియంగా మార్చాలనే ఆలోచన ఉన్నతాధికారుల్లో ఉంది. అందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. భవనంలో కొన్ని నిర్మాణాలు తొలగించడం, మరికొన్ని చేపట్టి ఆడిటోరియంగా మార్చేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నాం.– సతీశ్, ఏఈ, ఆర్‌అండ్‌బీ, వేములవాడ

# బ్యాంకు లింకేజీ రుణ లక్ష్యం ఖరారు

బోయినపల్లి : స్వశక్తి మహిళా సంఘాల సభ్యులు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వం బ్యాంకు లింకేజీ రుణాలను అందిస్తోంది. వీటిని సద్వినియోగం చేసుకుంటూ మహిళా సంఘాల సభ్యులు చిరు వ్యాపారం, కుట్టు మిషన్, ఇతర వ్యాపార రంగాల్లో రాణిస్తున్నారు. ప్రతి నెలా రుణ వాయిదాలను బ్యాంకుల్లో చెల్లిస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఉమ్మడి జిల్లాలోని 40,827 మహిళా సంఘాలకు రూ.2,489.03 కోట్ల రుణాలు అందించాలని లక్ష్యంగా నిర్దేశించారు. స్వశక్తి మహిళా సంఘాల సభ్యులు ప్రతి నెలా కొంత మొత్తాన్ని బ్యాంకులో పొదుపు చేస్తుంటారు. సంఘాల పని తీరు, పొదుపు ఆధారంగా బ్యాంకులు రుణాలను అందిస్తున్నాయి. ప్రతి సంఘానికి వారి అవసరం మేరకు అర్హత ఆధారంగా లక్ష రూపాయల నుంచి గరిష్ఠంగా రూ.20 లక్షల వరకు బ్యాంకు లింకేజీ రుణాలు మంజూరు చేస్తున్నారు. వీటిని పొందిన సభ్యులు తమకు ఆసక్తి ఉన్న రంగాల్లో పెట్టుబడి పెట్టి వ్యాపారం చేస్తూ ఆర్థికంగా ముందుకు సాగుతున్నారు. అధికంగా సభ్యులు కుట్లు, అల్లికలు, వస్త్ర దుకాణం, కిరాణం, పేపర్ ప్లేట్ల తయారీ, చేతి రుమాళ్లు, పాడి పరిశ్రమపై ఆధారపడి ఆదాయం పొందుతూ ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు. తీసుకున్న రుణాలను క్రమం తప్పకుండా వడ్డీతో సహా బ్యాంకులో చెల్లిస్తున్నారు.

గత ఆర్థిక సంవత్సరం కంటే రూ.372.33 కోట్లు అధికం

గత ఆర్థిక సంవత్సరంలో రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల్లోని 36,993 మహిళా సంఘాల సభ్యులకు రూ. 2,116.7 కోట్ల రుణం మంజూరు చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఈ మేరకు అధికారులు ఎప్పటికప్పుడు మండల స్థాయి అధికారులతో సమావేశాలు నిర్వహించారు. గ్రామాల్లోని మహిళా సంఘాల సభ్యుల అవసరాల మేరకు, గత రుణాల చెల్లింపు ఆధారంగా రుణాలను మంజూరు చేశారు. గత ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన లక్ష్యం మేరకు చేయగా, పలు మండలాల్లో లక్ష్యానికి మించి ఇచ్చారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 40,827 సంఘాలకు రూ. 2,489.03 కోట్ల రుణ లక్ష్యాన్ని నిర్దేశించారు. గతంలో నిర్దేశించిన లక్ష్యం కంటే రూ. 372.33 కోట్లు అధికం. గత ఆర్థిక సంవత్సరంలో కంటే 3,834 మహిళా సంఘాలు పెరిగాయి.

లక్ష్యం మేరకు పంపిణీ చేస్తాం– శేషాద్రి, డీఆర్డీవో

స్వశక్తి మహిళా సంఘాలకు గత ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన లక్ష్యం మేరకు రుణాలు వందశాతం అందించాం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో లక్ష్యం మేరకు ఇవ్వడానికి అధికారులతో సమావేశాలు ఏర్పాటు చేసి తగిన సూచనలు, సలహాలు అందిస్తాం. మహిళా సంఘాల సభ్యులు రుణాలు సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలి. క్రమం తప్పకుండా తిరిగి రుణాలు చెల్లించాలి.

# జలఘంటిక.. మేల్కోవాలిక

హైదరాబాద్ : రాజధానిలో భూగర్భ జలాలు ఆవిరవడంతో.. ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మొత్తంగా.. గతంతో పోలిస్తే తాగునీటి సరఫరా సమయం, నీటి ఒత్తిడి చాలా వరకు తగ్గింది. సంపులోని నీరు సగం రోజుకే తరిగిపోతున్నాయి. దాంతో.. వేలాది మంది రోజూ ట్యాంకర్ల కోసం జలమండలిని సంప్రదిస్తున్నారు. పలు ప్రభుత్వ ఆఫీసులు, వాణిజ్య సముదాయాలు, హోటళ్లలోనూ నీటి ఎద్దడి కనిపిస్తోంది. ప్రభుత్వ, ప్రైవేటు నీటి ట్యాంకర్ల సాయంతో అవసరాలను తీర్చుకుంటున్నారు. అదే సమయంలో.. కొన్ని కాలనీ సంఘాలు పొదుపు మంత్రం పఠిస్తున్నాయి. ఎండలు పెరుగుతుండటంతో సమస్య తీవ్రమవుతుందని, జలమండలి నీటి సరఫరాను యథాతథంగా కొనసాగిస్తున్నప్పటికీ.. భూగర్భ జలాలు అడుగంటడంతో సమస్య తలెత్తిందని అధికారులు గుర్తు చేస్తున్నారు.

టీ కప్పులు కడిగేందుకూ.. కటకట

మాసబ్‌ట్యాంక్ సమీపంలోని ఓ ప్రభుత్వ భవన సముదాయంలో రోజు విడిచి రోజు నీటి సమస్య ఎదురవుతోంది. దాంతో.. టీ కప్పులను శుభ్రం చేసేందుకు కూడా నీరు ఉండట్లేదని సిబ్బంది వాపోతున్నారు. ఇదేంటని ఆరాతీస్తే.. జలమండలి ద్వారా వచ్చే నీరు త్వరగా అయిపోతోందని, బోరుబావి ఎండిపోవడం వల్ల ట్యాంకర్లను తెప్పించుకుంటున్నామని, ఆ నీరు కూడా సరిపోవట్లేదని అధికారులు తెలిపారు.

మార్చిలో ఏకంగా 1.69 లక్షల ట్రిప్పులు

గ్రేటర్ వ్యాప్తంగా నీటి ట్యాంకర్లకు భారీ డిమాండ్ ఏర్పడింది. అనేక ప్రాంతాల్లో బోర్లు ఎండిపోవడంతో నీటి సరఫరా కోసం జలమండలి ట్యాంకర్ల వైపు చూస్తున్నారు. దీంతో ఒకేసారి ట్యాంకర్లకు డిమాండ్ పెరుగుతోంది. ఈ ఏడాది ఒక్క మార్చి నెలలోనే 1.68 లక్షల ట్రిప్పులను జలమండలి సరఫరా చేసింది. గతేడాది మార్చి నెలతో పోల్చితే 56 వేల ట్రిప్పులు అదనంగా అందించారు. వానలు లేకపోతే



మే నెలలో మరింత డిమాండ్ పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం గ్రేటర్ వ్యాప్తంగా 660 ఎంజీడీల వరకు నీటి డిమాండ్ ఉండగా.. జలమండలి 560 ఎంజీడీల వరకు సరఫరా చేస్తోంది. డిమాండ్‌కు సరఫరాకు మధ్య దాదాపు 100 ఎంజీడీలు తేడా ఉంది. రోజూ జలమండలికి ట్యాంకర్ల కోసం 4900 వరకు ఫోన్లు వస్తుండగా.. 6584 ట్రిప్పులు సరఫరా చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. నిత్యం 7 వేల ట్రిప్పులు పెండింగ్‌లో ఉంటున్నాయి. చాలా ప్రాంతాల్లో ట్యాంకర్ బుక్ చేసిన 2–3 రోజులకు కూడా సరఫరా చేయలేని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో 24 గంటలపాటు సరఫరా చేయాలని జలమండలి ఇప్పటికే నిర్ణయించింది.

కేంద్రాల తనిఖీ..ఫిల్లింగ్ కేంద్రాల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డి మంగళవారం కొన్ని కేంద్రాలను తనిఖీ చేశారు. మణికొండ, నేతాజీపార్కు, షేక్‌పేట ఫిల్లింగ్ కేంద్రాలను తనిఖీలు చేసి అక్కడ లాగ్ బుక్‌లను పరిశీలించారు. ప్రస్తుతం 75 ఫిల్లింగ్ కేంద్రాల్లో 121 పాయింట్ల ద్వారా ట్యాంకర్లు అందిస్తున్నామని, త్వరలో మరిన్ని ఫిల్లింగ్ కేంద్రాలను, ట్యాంకర్లను పెంచనున్నట్లు ఎండీ చెప్పారు.

'అలేఖ్య' ఆదర్శం.. ఈతకొలను మూసేద్దాం

ఎండాకాలం వచ్చిందంటే గేటెడ్ కమ్యూనిటీల్లోని ఈతకొలనుల్లో పిల్లలు, పెద్దలు జలకాలాడుతుంటారు. చెప్పాలంటే ఈతకొలనులే గేటెడ్ కమ్యూనిటీల్లో ప్రత్యేక ఆకర్షణ. నీటి ఎద్దడి కారణంగా ఈసారి స్వచ్ఛందంగానే పలుచోట్ల సొసైటీల్లోని ఈతకొలనులను మూసేస్తున్నారు. బెంగళూరులోని పరిస్థితి మన దగ్గర రాకూడదని ఎల్బీనగర్‌లోని అలేఖ్య టవర్స్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ సొసైటీ ముందు జాగ్రత్తగా ఈసారి తమ కమ్యూనిటీలోని ఈత కొలనును తాత్కాలికంగా మూసేయాలని నిర్ణయించింది. సిటీలో పెరుగుతున్న నీటి కొరతను గమనించి ఈ నిర్ణయం తీసుకుందని గృహ యాజమాని ఒకరు తెలిపారు. తమ కమ్యూనిటీలో నీటికొరత లేదని.. అయితే బయట చాలా ప్రాంతాల్లో తాగడానికి, వాడుకోవడానికి నీటికి ఇబ్బంది పడుతుంటే.. తాము జలకాలాటలు ఆడటం సరికాదని భావించి సొసైటీ ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు.

# మూసీ ఒడ్డున నిర్మాణాలొద్దు.. నదికి ఇరువైపులా ఆంక్షలు

హైదరాబాద్: మూసీనది నుంచి 50 మీటర్ల పరిధిలో నిర్మాణ, లేఅవుట్ అనుమతులను నిలిపేయాలని జీహెచ్‌ఎంసీ నిర్ణయించింది. వేర్వేరు సంస్థల ఆధ్వర్యంలో చేపట్టే అభివృద్ధి పనులనూ అనుమతించవద్దని కమిషనర్ రోనాల్డ్ రాస్ ఉత్తర్వు జారీ చేశారు. ఆదేశాలను వెంటనే, నదికి ఇరువైపులా అమలుచేయా లని జోనల్ కమిషనర్లు, ఉప కమిషనర్లు, ప్రణాళికాధికారులు, సహాయ ప్రణాళికాధికారులను ఆదేశించారు. ఎంఆర్‌డీసీఎల్(మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్) అభ్యర్థన మేరకు బల్దియా ఈ నిర్ణయం తీసుకుంది. సమగ్రాభివృద్ధి దిశగా..: మూసీని.. సంపదను సృష్టించే వనరుగా ఉపయోగించుకోవాలనేది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆకాంక్ష. అందులో భాగంగా నదిని సర్వే చేయాలని ఆదేశాలిచ్చారు. ఆ మేరకు సర్వేయర్ల ఆధ్వర్యంలో ఇటీవలి వరకు సర్వే జరిగింది. బఫర్ జోన్‌లో నిర్మాణ పనులను అధికారులు గుర్తించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. క్షేత్రస్థాయి పరిశీలనతో..'ఈనాడు' సైతం ఇటీవల కథనాన్ని ప్రచురించింది. వాటన్నింటినీ ఎంఆర్‌డీసీఎల్ పరిగణలోకి తీసుకొని. నది పొడవునా ఎలాంటి కట్టడాలను అనుమతించవద్దని సంబంధిత మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, ప్రంచాయతీలు, జీహెచ్‌ఎంసీకి లేఖ రాయగా.. జీహెచ్‌ఎంసీ కమిషనర్ తాజా ఉత్తర్వును జారీ చేశారు. మూసీ నదిలో ఇప్పటికే 10వేల ఆక్రమణలను అధికారులు గుర్తించారు. బఫర్ జోన్‌పై అయోమయం ఉండేది. దాంతో.. కొందరు అధికారులు బఫర్ జోన్‌లోనూ అనుమతులు ఇచ్చేవారు.




వయనాడ్: పశ్చిమ కనుమల నడుమ ఆహ్లాదంగా ఉండే కేరళలోని వయనాడ్ జిల్లా.. ఇప్పుడు ప్రకృతి ప్రకోపంతో అతలాకుతలమైంది. భారీ వర్షం కారణంగా కొండచరియలు విరిగిపడి బీభత్సం సృష్టించాయి. ఎన్నో ఇళ్లు నేలమట్టమయ్యాయి. దీంతో పదుల సంఖ్యలో ప్రాణాలు ఆ శిథిలాల కింద అసువులుబాశాయి. వయనాడ్ జిల్లాలోని మెప్పాడి, ముండక్కై, చురల్‌మల ప్రాంతాల్లో చోటుచేసుకున్న ఈ ఘోర విపత్తులో ఇప్పటివరకు 93 మంది మృతిచెందినట్లు రాష్ట్ర రెవెన్యూ కార్యాలయం వెల్లడించింది. మరో 116 మంది గాయపడినట్లు తెలిపింది.

**సహాయక శిబిరంపైనా బండరాళ్లు..** తొలుత అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో ముండక్కై ప్రాంతంలో కొండచరియలు విరిగిపడ్డాయి. సమాచారమందుకున్న రెస్క్యూ సిబ్బంది వెంటనే అక్కడకు వెళ్లి సహాయక చర్యలు చేపట్టారు.

కొంతమంది బాధితులను సమీపంలోని చురల్‌మల స్కూల్ వద్ద ఏర్పాటు చేసిన సహాయక శిబిరానికి పంపించారు. అయితే ప్రమాదవశాత్తూ తెల్లవారుజామున 4 గంటలకు ఈ స్కూల్ సమీపంలో మరోసారి కొండచరియలు పడ్డాయి. దీంతో శిబిరం సహా చుట్టుపక్కల ఇళ్లు, దుకాణాలు బురదలో కొట్టుకుపోయాయి.

**ఎడతెరిపిలేని వర్షం..** కొండచరియల పడటంతో వందల సంఖ్యలో ఇళ్లు ధ్వంసమయ్యాయి. అనేక వాహనాలు కొట్టుకుపోయాయి. చురల్‌మలలో కొంత భాగం తుడిచి పెట్టుకుపోయింది. అనేక మంది శిథిలాల కింద చిక్కుకుని సాయం కోసం ఆర్తనాదాలు చేస్తున్నారు. వీరిని కాపాడేందుకు సహాయక బృందాలు రంగంలోకి దిగాయి. ఆర్మీ, ఎన్డీఆర్ఎఫ్ సాయంతో రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది. అయితే ఎడతెరిపి లేని వర్షం కారణంగా సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. ముండకైలో ఈ మధ్యాహ్నం మరోసారి కొండచరియలు విరిగిపడినట్లు సమాచారం. వరద, బురద ప్రవాహంతో వందల మంది కొట్టుకుపోయినట్లు సమాచారం. వారి ఆచూకీ కోసం సహాయక బృందాలు గాలింపు చేపడుతున్నారు. డ్రోన్లు, జాగిలాలతో అన్వేషణ సాగిస్తున్నారు. మరోవైపు, వయనాడ్ విపత్తు నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం రేపటి నుంచి రెండు రోజులు సంతాపదినాలుగా ప్రకటించింది.




## భారత్‌కు మరో పతకం.. షూటింగ్‌లో కాంస్య సాధించిన మను బాకర్, సరబ్‌జ్యోత్ సింగ్

పారిస్ ఒలింపిక్స్‌లో భారత్ ఖాతాలో మరో పతకం చేరింది. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో సరబ్‌జోత్ సింగ్, మను బాకర్ జోడీ దక్షిణ కొరియాతో పోటీపడి కాంస్య పతకాన్ని గెలుచుకుంది. మను బాకర్ జోడి 16 పాయింట్లు సాధించగా.. దక్షిణ కొరియా ద్వయం (లీ-యెజిన్) 10 పాయింట్లు సాధించింది. మను ఇప్పటికే వ్యక్తిగత విభాగం 10 మీటర్ల ఎయిర్ పిస్టల్‌లో కాంస్య పతకం సాధించిన సంగతి తెలిసిందే. దీంతో స్వాతంత్ర్యం తర్వాత ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు సాధించిన భారత అథ్లెట్‌గా ఆమె రికార్డు సృష్టించింది.

భారతదేశం బ్రిటిష్ పాలనలో ఉన్నప్పుడు 1900 ఒలింపిక్స్‌లో బ్రిటీష్-ఇండియన్ అథ్లెట్ నార్మన్ ప్రిచర్డ్ అథ్లెటిక్స్‌లో రెండు రజత పతకాలు సాధించాడు.

## హోలో గ్రామ్ పేరిట భారీ స్కామ్.. వెలుగులోకి వైసీపీ ఆగడాలు



అమరావతి, జూలై 30: ఎక్సైజ్ శాఖలో గత ప్రభుత్వ ఆగడాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. నకిలీ హోలో గ్రామ్ స్టిక్కర్లతో మద్యం సరఫరా జరిగినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏడాదికి 13 కోట్ల 68 లక్షల మద్యం, బీరు బాటిళ్లకు హోలో గ్రామ్ స్టిక్కర్ల టెండర్లలోనూ అవకతవకలు జరిగినట్లు తెలుస్తోంది. నకిలీ హోలో గ్రామ్ స్టిక్కర్లతో మద్యం సరఫరా చేసేందుకే టెండర్లను పక్కదారి పట్టించినట్టు అనుమానాలు ఉన్నాయి. హోలో గ్రామ్ టెండర్లపై విజిలెన్సు విచారణలో అనేక అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. హోలో గ్రామ్ పేరిట భారీ స్థాయిలో స్కామ్ జరిగినట్టు గుర్తించినట్టు సమాచారం. నిబంధనలకు విరుద్ధంగా మద్యం బాటిళ్లకు వేసే హోలో గ్రామ్ టెండర్లను కట్టబెట్టినట్టు తెలుస్తోంది.

ఎక్స్ పీరియన్స్ సర్టిఫికెట్లు లేకుండానే హోలో గ్రామ్ కంపెనీలకు బెవరేజెస్ కార్పొరేషన్ మాజీ ఎండీ వాసుదేవ రెడ్డి ఇష్టానుసారం టెండర్లు కట్టబెట్టారని... జీఎస్టీ లావాదేవీల సమాచారం, గతంలో చేసిన వ్యాపారం వివరాలు లేకుండానే టెండర్లు కట్టబెట్టేసినట్టు విజిలెన్సు బయటపడ్డ వైనం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. హోలో గ్రామ్ టెండర్లకు సంబంధించిన కీలక సమాచారం గల్లంతైనట్టు విచారణలో వెల్లడైంది. హోలో క్రాఫ్ట్ ప్రక్రియలో సాంకేతిక కమిటీ నివేదికపై అధికారిక సంతకాలు లేనట్టు విజిలెన్స్ అధికారులు గుర్తించారు. సాంకేతిక కమిటీ సమావేశం మినిట్స్ కూడా కనిపించకుండా మాయం చేసినట్టు అధికారులు గుర్తించారు.

## వైసీపీ ప్రభుత్వంలో పోలీసు వ్యవస్థ నిర్వీర్యం

విశాఖపట్నం: వైసీపీ ప్రభుత్వంలో పోలీసు వ్యవస్థ నిర్వీర్యమైందని ఆంధ్రప్రదేశ్ హోం మంత్రి వంగలపూడి అనిత ఆరోపించారు. విశాఖపట్నం నుంచి అన్ని జిల్లా ఎస్పీలతో సమీక్ష సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయంతో మహీంద్రా వాహన తయారీ సంస్థ పోలీసులను బ్లాక్‌లో పెట్టిందని గుర్తుచేశారు. పోలీసులకు వీక్ ఆఫ్ మీద పరిశీలిస్తామని అన్నారు. గత ప్రభుత్వంలో సరెండర్ సెలవుల ఇవ్వకుండా చేశారని ధ్వజమెత్తారు. తమ ప్రభుత్వంలో సరెండర్ లీవులు నిధులిస్తామని స్పష్టం చేశారు. మంగళవారం నాడు విశాఖ పోలీస్ కమిషనరేట్ హాల్లో మంత్రి అనిత మీడియాతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో చివరికి పోలీసుల భద్రత కోసం పక్క రాష్ట్రం నుంచి తుపాకులు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. పోలీసు అకాడమీ లేని రాష్ట్రం ఏపీనే అని చెప్పారు. వైసీపీ హయాంలో అమరావతి కట్టడానికి నిధులిస్తే అమరావతిలో కట్టడం ఇష్టం లేక, కట్టడం మానేశారని అన్నారు. తమ ప్రభుత్వంలో సోషల్ మీడియా మీద దృష్టి పెడతామని మంత్రి అనిత పేర్కొన్నారు. గంజాయి నివారణ, పోలీస్ సంక్షేమం మీద సమీక్ష నిర్వహించామని తెలిపారు పోలీసు విభాగం ఇన్వెస్టిగేషన్ టూల్ లేవని చెప్పారు. ఎక్కడ ఏం జరిగినా దాని వెనుక గంజాయి ఉందని తెలిపారు. ఈ ఐదు జిల్లాల్లో గంజాయి నియంత్రణకు కృషి చేస్తున్నామని వివరించారు. ఏజెన్సీలో గంజాయి పంట మీద సీసీ కెమెరాలతో నిఘా పెట్టామని అన్నారు. గంజాయి నివారణపై మంత్రివర్గ ఉప సంఘం నియమించినట్లు గుర్తుచేశారు.



హోం మంత్రి, విద్యా శాఖ మంత్రి, గిరిజన శాఖ మంత్రి, అబ్కారీ మంత్రితో కలిసి ఈ ఉపసంఘం పనిచేస్తోందని వివరించారు. గంజాయి వివరాలు ఇస్తే వారికి బహుమతి ఇస్తామని ప్రకటించారు. అన్ని జిల్లాలో కూడా ఒక ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామని మంత్రి అనిత వెల్లడించారు. మైనర్ బాలిక విషయంలో పోక్సో చట్టం అమలు అవుతోందని స్పష్టం చేశారు. విశాఖలో గంజాయి సేవించే వారికి అనుకూల ప్రాంతాలను గుర్తించి వాటి మీద పోలీసు దృష్టి పెట్టామని చెప్పారు. పోలీసు విభాగాలకు కావాల్సిన సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. డ్రగ్స్ తీసుకున్న వ్యక్తిని పరీక్షించి నిర్ధారించే పరికరాలు పోలీసు శాఖ వద్ద లేవని చెప్పారు. జగన్ ప్రభుత్వంలో అధునాతన పరికరాలు, వాహనాల నిర్వహణ సరిగా లేదని మండిపడ్డారు. పోలీస్ వ్యవస్థ మళ్లీ పటిష్టంగా పని చేయాలని మంత్రి అనిత సూచించారు.

## పోలవరం ఎమ్మెల్యే కారుపై దాడి కేసులో విచారణ వేగవంతం



ఏలూరు, జూలై 30: పోలవరం జనసేన ఎమ్మెల్యే చిర్రీ బాలరాజు కారుపై జరిగిన రాయి దాడి కేసులో విచారణను పోలీసులు వేగవంతం చేశారు. దాడి జరిగిన ప్రాంతమైన హాస్టల్ పరిసరాల్లో జీలుగుమిల్లీ సీఐ క్రాంతి కుమార్, బుట్టాయిగూడెం ఎస్సై వెంకన్న తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ... కర్రలతో దాడి జరిగినట్లు సోషల్ మీడియాలో వచ్చిన కథనాలు పూర్తిగా అవాస్తవమన్నారు. దాడి ఘటనలో కారులో ఎమ్మెల్యే బాలరాజు లేరని తెలిపారు. జరిగిన ఘటనపై పూర్తి విచారణ చేసి నిందితులను పట్టుకుంటామని జీలుగు మిల్లీ సీఐ క్రాంతి కుమార్, బుట్టాయిగూడెం ఎస్సై వెంకన్న స్పష్టం చేశారు.

**అసలేం జరిగిందంటే..** ఎమ్మెల్యే బాలరాజు కారుపై గత రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు రాళ్లతో దాడి చేశారు. జీలుగుమిల్లి మండలం బర్రింకలపాడు జంక్షన్ వద్ద ఎమ్మెల్యే కారుపై దాడి జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు రాళ్లతో దాడి చేయడంతో కారు అద్దాలు ధ్వంసమయ్యాయి. ఎమ్మెల్యే కారుపై దాడి ఘటన జిల్లాలో తీవ్ర కలకలం రేపింది. అయితే దీనిపై ఎమ్మెల్యే స్వయంగా ఓ ప్రకటన చేశారు. “బర్రింకలపాడు నుంచి సోమవారం రాత్రి జీలుగుమిల్లి బయలుదేరిన నా వాహనంపై గుర్తుతెలియని వ్యక్తులు రాళ్లతో దాడి చేశారు. కారు వెనుక అద్దాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. దాడి జరిగిన సమయంలో కారులో నేను లేను.

నేను సేఫ్‌గా ఉన్నా నియోజకవర్గంలోని కార్యకర్తలు, అభిమానులు ఎలాంటి ఆందోళన చెందవద్దు. ఘటనపై విచారించి దాడి చేసినవారిపై చర్యలు తీసుకుంటాం” అని ఎమ్మెల్యే బాలరాజు ప్రకటించారు. ఈ సంఘటనపై పోలీసు నిఘా వర్గాలు ఆరా తీస్తున్నాయి. మరోవైపు ఈ విషయం తెలిసిన వెంటనే డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ స్పందించారు. ఈ ఘటనను డిప్యూటీ సీఎం తీవ్రంగా ఖండించారు. దాడికి పాల్పడిన వారిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని పవన్ కళ్యాణ్ కోరారు.

**ఓ సామాన్యుడిలా....** మరోవైపు ఓ సామాన్యుడిలో ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లి పని విషయంలో అలసత్యం వహిస్తున్న ఉద్యోగిపై ఎమ్మెల్యే తీసుకున్న చర్యలు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. దీనికి సంబంధించిన వీడియో కూడా సోషల్ మీడియాతో హల్‌చల్ చేస్తోంది. కేటీఆర్ పురం ఐటీడీఏ కార్యాలయానికి ఎమ్మెల్యే బాలరాజు ఓ సామాన్యుడిలా వెళ్లారు. మొహానికి మాస్కు పెట్టుకుని ఆఫీసులో తనిఖీకి వెళ్లారు. అయితే ఆ సమయంలో ఓ ఉద్యోగి.. పనిని పక్కన పెట్టేసి తాపీగా ఫోన్‌లో పబ్జి గేమ్ ఆడుకుంటూ ఎమ్మెల్యే కళ్లకు చిక్కాడు. సదరు ఉద్యోగి సాయికుమార్‌గా తెలుస్తోంది. ఆ ఉద్యోగి వెనకాలే ఉండి చాలా సేపు అతడు చేస్తున్న పనిని ఎమ్మెల్యే గమనించారు. పనివేళల్లో పబ్జీ గేమ్ ఆడుతున్న ఉద్యోగిని ఎమ్మెల్యే రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అంతేకాకుండా అతడిని సస్పెండ్ చేయాలని అధికారులకు ఎమ్మెల్యే బాలరాజు ఆదేశాలిచ్చారు.




## ప్లీజ్ మమ్మల్ని కాపాడండి.. వయనాడ్‌లో శిథిలాల కింద నుంచి బాధితుల ఫోన్‌కాల్స్..!

ప్రకృతి ప్రకోపానికి గురైన వయనాడ్ నుంచి విషాదకర కథనాలు బయటకు వస్తున్నాయి. మంగళవారం తెల్లవారుజామున అక్కడ కొండచరియలు, బురద ధాటికి పదుల సంఖ్యలో ప్రజలు శిథిలాల్లో చిక్కుకుపోయారు. ఆ పరిస్థితుల్లో వారు తమ ఆత్మీయులకు ఫోన్లు చేసి ప్రాణాలు కాపాడాలని విలపించిన ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. ఇలాంటి ఫోన్ సంభాషణలను స్థానిక టీవీలు ప్రసారం చేస్తున్నాయి. ఓ సంభాషణలో చురల్మల ప్రాంతంలోని ఓ మహిళ తమ వారికి ఫోన్ చేసి.. ఇల్లు మొత్తం శిథిలాల్లో చిక్కుకుపోయింది.. అక్కడినుంచి బయటకు లాగి ప్రాణాలు కాపాడాలని కోరుతున్నట్లు ఉంది. “ఇల్లు మొత్తం పోయింది. మా వాళ్లు ఎక్కడ ఉన్నారో అర్థం కావడంలేదు. ఎవరో ఒకరు వచ్చి సాయం చేయండి” అని బిగ్గరగా రోదిస్తూ అవతలి వారిని కోరింది.

కొండచరియలు కూలి పడే సమయంలో ఆ ప్రాంతం మొత్తం కంపిస్తుండటంతో తాము ఎక్కడికి వెళ్లాలో అర్థం కాలేదని చురల్మలకు చెందిన మరో వ్యక్తి వెల్లడించాడు. ఇక ముండకై లో భారీగా ప్రజలు బురదలో కూరుకుపోయి విలవిల్లాడుతున్నారని పేర్కొంటూ తమకు ఫోన్‌కాల్ వచ్చిందని ఓ వ్యక్తి వెల్లడించాడు. ఈ విషాద ఘటనలో గాయపడిన ఓ వృద్ధుడు తన భార్య ఆచూకీ గల్లంతైందని ఆందోళన వ్యక్తంచేశాడు. వయనాడ్‌లో కొండచరియలు, బురద విరుచుకుపడిన ఘటనలో ఇప్పటివరకు 50 మంది మరణించగా.. 70 మంది వరకు గాయపడ్డారు. ఈ ప్రాంతంలో భారీగా వర్షాలు కురుస్తుండటంతో సహాయక బృందాలు ముందుకువెళ్లలేని పరిస్థితి నెలకొంది. కొద్దిసేపటి క్రితమే ఐదుగురు ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది ఎట్టకేలకు ముండకై ప్రాంతానికి చేరుకున్నట్లు వార్తలొస్తున్నాయి.

## అటవీ శాఖ ఉద్యోగులపై దాడి చేస్తే కఠిన చర్యలు: డిప్యూటీ సీఎం పవన్



అమరావతి: పల్నాడు జిల్లాలో అటవీ శాఖ ఉద్యోగులపై దాడిని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఖండించారు. పల్నాడు జిల్లా కలెక్టర్, ఎస్పీతో ఆయన మాట్లాడారు. వన్యప్రాణులను అక్రమ రవాణా చేస్తే ఉపేక్షించవద్దన్నారు. అటవీ శాఖ ఉద్యోగులపై దాడి చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

**అమెరికా కాన్సుల్ జనరల్‌తో పవన్ భేటీ :** డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో అమెరికా కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ భేటీ అయ్యారు. లార్సన్ బృందాన్ని ఆయన సత్కరించారు. ఏపీలో పెట్టుబడులు, అభివృద్ధి ప్రాజెక్టులపై ఇరువురి మధ్య చర్చ జరిగింది. ఉన్నత విద్యకు అమెరికా వెళ్లే యువతకు సహకారం ఇవ్వాలని పవన్ కల్యాణ్ కోరారు.

## వారిపై త్వరలోనే కఠిన చర్యలు తీసుకుంటాం: మంత్రి నిమ్మల

పశ్చిమ గోదావరి: ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో ఎన్డీయే కూటమిని ప్రజలు ఎంత బాగా ఆశీర్వదించారో రాష్ట్రాన్ని కూడా ప్రకృతి అదే విధంగా దీవిస్తోందని జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి ఏపీలో జలకళ సంతరించుకుందని ఆయన చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నదులు, జలాశయాలు నిండుకుండలా మారాయని మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ..”భారీగా కురిసిన వర్షాల నేపథ్యంలో శ్రీశైలం డ్యాం ఐదు గేట్లు ఎత్తి 1.35లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నాం. నాగార్జునసాగర్ పూర్తి సామర్థ్యం 312క్యూసెక్కులకు గాను 140క్యూసెక్కుల నీరు డ్యాంలోకి చేరింది. రాయలసీమ ప్రాంతానికి తాగు, సాగునీరు అవసరాలు తీర్చే విధంగా పోతిరెడ్డి, వెలుగోడు, ఆల్మట్టి డ్యాంలు నిండాయి. హంద్రీనీవా, తుంగభద్రా నుంచి పెద్దఎత్తున వర్షపు నీరు జలాశయాలకు చేరుతోంది. హంద్రీనీవా



ప్రాజెక్టు నిర్వాహక అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. వారం రోజుల క్రితమే గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా వారు స్పందించలేదు. ఆ అధికారుల్లో గత వైసీపీ ప్రభుత్వ పాలన వాసన పోలేదు. వారిపై త్వరలోనే కఠిన చర్యలు తీసుకుంటాం” అని అన్నారు.

## రాష్ట్ర విభజన తర్వాత ఏపీ ఎందుకు నష్టపోయిందంటే..: జీవీఎల్

విశాఖ: బీజేపీ సీనియర్ నేత, మాజీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు హాట్ కామెంట్స్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో డబుల్ ఇంజన్ సర్కార్ వల్ల రాష్ట్ర ప్రయోజనాలకు శుభ పరిణామమని, కేంద్రం ఏపీకి నిధులు ఇస్తే కాంగ్రెస్ ఎందుకు కళ్లలో నిప్పులు పోసుకుంటోందని ప్రశ్నించారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర విభజన సమయంలో ఆంధ్ర ప్రదేశ్ అవసరాలను కాంగ్రెస్ గుర్తించలేదని, రాష్ట్ర విభజన తర్వాత ఏపీ నష్ట పోవడానికి రాజధాని లేకపోవడమే కారణమని అన్నారాయన. వెనుకబడ్డ జిల్లాల అభివృద్ధికి ప్యాకేజ్ ప్రకటించడం హర్షించదగ్గ పరిణామమన్నారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ సమస్యలపై హైపవర్ కమిటీ నివేదిక సమర్పించిందని, క్రైసిస్ మేనేజ్ మెంట్ టీమ్ నివేదిక ఆధారంగా చర్యలు ప్రారంభమయ్యాయన్నారు. తనపై తప్పుడు ప్రచారాలు చేసే వాళ్లపై చట్ట పరమైన చర్యలు వుంటాయని, ఎవరి దగ్గరైనా 4 రూపాయలు తీసుకున్నట్టు నిరూపిస్తే క్షమాపణ చెబుతా.. లేదంటే తప్పుడు ప్రచారాలు చేసే వాళ్ళు బహిరంగ క్షమాపణ చెప్పాలని జీవీఎల్ నరసింహారావు డిమాండ్ చేశారు. ప్రధానిని కీలు బొమ్మను చేసి జనపథ్ నిర్ణయాలు అమలు చేసిన రాహుల్ గాంధీకి కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత లేదని జీవీఎల్ అన్నారు. ఏపీకి ప్రతిపక్ష హోదా అనేది డిమాండ్ చేస్తే వచ్చేది కాదన్నారు. 10 శాతం సీట్లు రాకపోతే ప్రతిపక్ష హోదా రాదని వైఎస్ జగన్‌పై సెటైర్లు వేశారు. ప్రజల పక్షాన పోరాడాలని అనుకుంటే.. ప్రతిపక్ష హోదా అవసరం లేదని.. కోర్టుకు ఎవరైనా వెళ్లవచ్చునని అన్నారు. రాష్ట్రపతి పాలన పెట్టాలనేది రాజకీయ ఎత్తుగడ తప్ప దానిని సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం లేదన్నారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ సమస్యలపై హైపవర్ కమిటీ నివేదిక సమర్పించిందని, క్రైసిస్ మేనేజ్ మెంట్ టీమ్ నివేదిక ఆధారంగా చర్యలు ప్రారంభమయ్యాయని, 3,100 కోట్ల రూపాయలు ప్రిఫరెన్షియల్ షేర్ విధానంలో పెట్టుబడులు పెట్టే ఛాన్స్ ఉందని అన్నారాయన.

## పర్యాటకులకు శుభవార్త.. ఆ జలపాతాల సందర్శనకు అనుమతి..



అరకులోయ: ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రముఖ పర్యటక కేంద్రాలైన కటికి, చాపరాయి జలపాతాల సందర్శనకు రాష్ట్ర పర్యాటన శాఖ అనుమతి ఇచ్చింది. ఇటీవల బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా భారీ వర్షాలు కురిశాయి. దీంతో కటికి, చాపరాయి జలపాతాలకు భారీగా వరదనీరు పోటెత్తింది. అప్రమత్తమైన అధికారులు పర్యాటకుల సందర్శనను నిలిపివేశారు. వర్షాలు, వరదనీరు తగ్గి జలపాతాలు సాధారణ స్థితికి రావడంతో సందర్శనను పునఃప్రారంభించారు.

**చాపరాయి జలపాతం ప్రత్యేకత..** చాపరాయి జలపాతాన్ని డుంబ్రిగుడా జలపాతాలు అని కూడా పిలుస్తారు. ఇది అరకు పర్యాటక ప్రదేశానికి సుమారు 15కి.మీ. దూరంలో ఉంటుంది. అడవుల మధ్య ఉండడంతో ఇక్కడికి వచ్చేందుకు పర్యాటకులు ఎక్కువగా మక్కువ చూపుతారు. సాధారణంగా వర్షాకాలంలో కొండప్రాంతాల్లో కురిసే వర్షాలతో జలపాతానికి భారీగా నీరు చేరుతోంది. దీన్ని చూసేందుకు, జలకాలు ఆడేందుకు పర్యాటకులు ప్రతి ఏటా పెద్దఎత్తున వస్తుంటారు. విశాలమైన కొండలపై నుంచి ఏటవాలుగా నీళ్లు పడడం ఇక్కడ ప్రత్యేకత. ఈ ప్రాంతం పిక్నిక్‌లకు బాగా ప్రసిద్ధి గాంచింది. వర్షాకాలంలోపాటు వేసవిలోనూ ఇక్కడికి ఎక్కువగా పర్యాటకులు వస్తుంటారు.

**కటికి జలపాతం ప్రత్యేకత..** కటికి గ్రామం పేరు మీదుగా ఈ జలపాతానికి పేరు వచ్చింది. బొర్రా గుహల నుంచి ఇవి సుమారు ఏడు కిలో మీటర్ల దూరంలో ఉన్నాయి. అలాగే అరకులోయ నుంచి 39 కి.మీ. దూరంలో ఉంటాయి. గోస్తని నది వల్ల కటికి జలపాతం ఏర్పడింది. 100అడుగుల కంటే ఎక్కువ ఎత్తు నుంచి నీరు పడడం ఇక్కడ ప్రత్యేకత.

# మల్లూ మందన్న అని పిలవాలేమో!

యువహృదయాలను కొల్లగొట్టిన రష్మిక మందన్న నేషనల్ క్రష్ గా వెలిగిపోతోంది. పుష్ప చిత్రంతో పాన్ ఇండియన్ లో ఫాలోయింగ్ సంపాదించుకుంది. రష్మిక పబ్లిక్ అప్పియరెన్స్ లకు విపరీతమైన స్పందన కనిపిస్తోంది. ఇటీవల కేరళలో జరిగిన ఓ ఈవెంట్లో తనను చూసేందుకు విచ్చేసిన అభిమానులను చూసి రష్మిక ఎమోషనల్ అయ్యారు. కేరళలో ఓ పబ్లిక్ ఈవెంట్ కి హాజరైన రష్మికను చూసేందుకు దాదాపు 2 వేలమంది అభిమానులు తరలివచ్చారు. ఈ సందర్భంగా రష్మిక తనదైన శైలిలో స్పందించారు. అభిమానులనుద్దేశించి ఓ ట్వీట్ చేశారు. ఓ కార్యక్రమంలో భాగంగా జులై 25న కేరళలోని కరునాగపల్లికి వెళ్లా. ఆ కార్యక్రమాన్ని చక్కగా నిర్వహించారు. వాళ్లు నాపై చూపించిన ప్రేమ చూసి ఆశ్చర్యపోయా. అంత ప్రేమను అస్సలు ఊహించలేదు. వారి అభిమానంతో నా హృదయం నిండిపోయింది. నన్ను ఆరాధిస్తున్నందుకు, జాగ్రత్తలు



తీసుకున్నందుకు కృతజ్ఞతలు. ఇంతమంది ప్రేమ పొందేందుకు ఏం చేశానో తెలియదు. కానీ సంతోషంగా ఉన్నా. మిమ్మల్ని ఎప్పటికీ ప్రేమిస్తూనే ఉంటాను అని అన్నారు. కేరళలో రష్మిక ఫాలోయింగ్ చూసాక మల్లూ రష్మిక అని పిలవాలేమో! అంటూ అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. ప్రస్తుతం అరడజను చిత్రాలతో బిజీగా ఉన్న రష్మికకు 2024-25 సీజన్ బెస్ట్ సీజన్ కాబోతోంది. పుష్ప 2-ది గర్ల్‌ఫ్రెండ్-సికందర్-కుబేర లాంటి భారీ పాన్ ఇండియా చిత్రాల్లో రష్మిక నటిస్తోంది. వీటితోపాటు లక్ష్మణ్ ఉటేకర్ తెరకెక్కిస్తోన్న బాలీవుడ్ చిత్రంలోనూ కథానాయికగా నటిస్తోంది.

**కుబేర సహనటుడు ధనుష్‌కి విష్ :** పుట్టినరోజు శుభాకాంక్షలు ధనుష్! అంటూ తన సోషల్ మీడియా హ్యాండిల్స్‌లో శుభాకాంక్షలు తెలియజేసిన రష్మిక కుబేర గురించి కొన్ని విషయాలు రివీల్ చేసింది. ధనుష్ నటించిన కుబేర నుండి కొత్త పోస్టర్‌ను షేర్ చేసిన రష్మిక ధనుష్ తో కలిసి ఉన్న ఫోటో లేకపోవడంపై తన విచారాన్ని వ్యక్తం చేసింది. మేం కలిసి ఉన్న ఫోటో లేదు.. మా సినిమా షూటింగ్ ఎక్కువగా ఫోటోజెనిక్ గా లేని ప్రాంతాల్లో జరుగుతుంది. కానీ ఈ పోస్టర్ నాకు చాలా ఇష్టం. కాబట్టి దీనితో నేను మీకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.. అని వెల్లడించింది.

# సూర్య- మహేష్ స్కూల్ మేట్స్!

సూపర్ స్టార్ మహేష్- కోలీవుడ్ స్టార్ సూర్య- మ్యూజిక్ డైరెక్టర్ యువన్ శంకర్ రాజా ఒకే స్కూల్లో చదువుకున్నారా? బాల్యంలో ముగ్గురు క్లోజ్ గా ఉండేవారా? అంటే అవుననే తెలుస్తోంది. ఈ విషయాన్ని స్వయంగా సూర్య రివీల్ చేసారు. అవేంటో ఆయన మాట్లోనే... చెన్నై సెయింట్ బీడ్స్ స్కూల్ వైపు వెళ్తే అన్ని చిన్న నాటి జ్ఞాపకాలు గుర్తొస్తాయి. అక్కడ ఒకటో తరగతి నుంచి పదవతరగతి వరకూ చదువుకున్నా. మహేష్, యువన్ శంకర్ రాజా క్లాస్ మేట్స్. వాళ్లతో చదువుకున్న రోజులంటే నాకెంతో ఇష్టం. ముగ్గురుం కలిసి తినేవాళ్లం. ఒకరికోసం ఒకరు ఇంట్లో చేసిన తిను పదార్థాలు తెచ్చేవాళ్లం. ఇంటి విషయాల గురించి ఎప్పుడూ మాట్లాడుకునే వాళ్లం. కానీ ఏ రోజు సినిమాల్లో నటించాలని అనుకోలేదు. చదువుకు పూర్తయ్యాక, నేను, యువన్ ఒకేసారి సినిమాల్లోకి వచ్చాం. పది సినిమాల వరకూ కలిసి పనిచేసాం. మహేష్ టాలీవుడ్ లో అడుగు పెట్టాడు. తనతో కలిసి పనిచేసే అవకాశం ఇంకా రాలేదు. కానీ



మహేష్ సినిమాలన్నీ చూస్తుంటా. నా అభిప్రాయాలన్నీ చెబుతుంటా%-% అని అన్నారు. మహేష్ బాల్యమంతా చెన్నైలో గడిచిన సంగతి తెలిసిందే. అతడి స్కూల్, కాలేజ్ లైఫ్ అంతా అక్కడే సాగింది. బాల నటుడిగానే తెరంగేట్రం చేసాడు. సూపర్ స్టార్ కృష్ణతో కలిసి ఎన్నో సినిమాలు చేసాడు. మహేష్ కి చిన్న నాటి స్నేహితులంతా చెన్నైలో ఉన్నాడు. పెద్దైన తర్వాత స్నేహాలు పెద్దగా చేయలేదు. చిన్న నాటి స్నేహితులతోనే అప్పుడప్పుడు టచ్ లో ఉంటున్నట్లు ఓ సందర్భంలో రివీల్ చేసారు. అలాగే టచ్ లో ఉన్న స్నేహితుడు హీరో సూర్య అన్న సంగతి తెలుస్తుంది. ఇంకా కోలీవుడ్ హీరోల్లో చాలా మంది మహేష్ కి స్నేహితులు అయ్యే అవకాశం ఉంది. మహేష్ చదువంతా చెన్నైలోనే పూర్తయింది. దీంతో పై చదువులంటూ విదేశాలకు వెళ్లకుండా సినిమాల్లోకి వచ్చి నటుడిగా స్థిరపడ్డారు.




# రొమాంటిక్ మెలోడీ.. ఇది పూరి మార్క్ క్యా లఫ్డే!



డబుల్ ఇస్మార్ట్ రిలీజ్ సమయం దగ్గర పడటంతో లిరికల్ సింగిల్స్ ఒక్కొక్కటి నెట్టింట శ్రోతల్ని అలరిస్తోన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే రిలీజ్ అయిన రెండు పాటలకు మంచి రెస్పాన్స్ వచ్చింది. మణిశర్మ మార్క్ మ్యూజిక్ అంటూ డబుల్ ఇస్మార్ట్ లో ముద్ర పడింది. ఇక రెండు రోజుల క్రితం క్యా లఫ్డే అనే సాంగ్ ప్రోమో కూడా రిలీజ్ చేసిన సంగతి తెలిసిందే. ఇది పక్కా పూరి మార్కో ప్రోమోగా హైలైట్ అయింది. తాజాగా క్యా లఫ్డే లిరికిల్ సింగిల్ కొద్ది సేపటి క్రితమే రిలీజ్ అయింది. ఈ సాంగ్ మెలోడీ ప్రియుల్ని ఆకట్టుకుంటుంది. పాట నెమ్మది గా ప్రారంభమైనా లోతులోకి వెళ్లే కొద్ది క్యా లఫ్డే శ్రోతల్ని అలరిస్తుంది. మెలోడీని బ్యాలెన్స్ చేస్తూ సాంగ్ కంపోజిషన్ బాగుంది. పూరి మార్క్ అందమైన హీరోయిన్ పాటలో హైలైట్ అవుతుంది. మొత్తంగా క్యా లఫ్డే అందమైన రొమాంటిక్ మెలోడీగా చెప్పొచ్చు. పూరి సినిమాల్లో ఇలాంటి మెలిడీలు తప్పనిసరి. సక్సెస్ సెంటిమెంట్ గానూ మెలోడీలు కలిసొచ్చాయి. మరి ఈసారి అదే సెంటిమెంట్ రిపీట్ అవుతుందా? అన్నది చూడాలి. డిజైనర్ దుస్తుల్లో కావ్యా థాపర్ కుర్రాళ్లను హీటెక్కించడం ఖాయం. ఈ పాటని శ్రీహర్ష ఈమని రచించగా, ధనుంజయ్, సింధుజా శ్రీనివాసన్ అలపించారు. ఈ చిత్రాన్ని పాన్ ఇండియాలో ఆగస్టు 15న రిలీజ్ చేస్తున్నారు. ఇస్మార్ట్ శంకర్ కి సీక్వెల్ కావడంతో అంచనాలు భారీగా ఉన్నాయి. ఈ సినిమా సక్సెస్ పూరి అండ్ కోకి అంతే అవసరం. గత సినిమా లైగర్ పాన్ ఇండియాలో తీవ్ర విమర్శలు తెచ్చి పెట్టిన సంగతి తెలిసిందే. ఇప్పుడా లెక్కలన్నింటిని డబుల్ ఇస్మార్ట్ సరి చేయాల్సి ఉంది.

# బచ్చన్ - ఇస్మార్ట్ ఎక్కడ స్టార్ట్ అయింది?




మిస్టర్ బచ్చన్ – డబుల్ ఇస్మార్ట్.. ఇండిపెండెన్స్ రోజు టాలీవుడ్ లో బిగ్ క్లాష్ పక్కా. ఇప్పటికే ఈ రెండు సినిమాలపై ఆడియన్స్ లో భారీ అంచనాలు నెలకొన్నాయి. మేకర్స్ రిలీజ్ చేసిన సాంగ్స్, పోస్టర్స్, గ్లింప్సెస్ తో పాజిటివ్ బజ్ క్రియేట్ అయింది. దీంతో ఓపెనింగ్స్ విషయంలో రెండు చిత్రాలకు గట్టి పోటీ నెలకొన్నట్లు కనిపిస్తోంది. ఏ సినిమా ఎంత వసూళ్లు సాధిస్తుందోనని అంతా మాట్లాడుకుంటున్నారు. రవితేజతో కెరీర్ స్టార్టింగ్ లో మంచి హిట్ సినిమాలు తీసి ఆయనను మాస్ మహా రాజాగా తీర్చిదిద్దారు పూరి జగన్నాథ్. దీంతో వీరిద్దరిదీ గురుశిష్యుల బంధంగా అభిమానులు భావిస్తారు. అయితే పూరీ జగన్నాథ్ తెరకెక్కించిన సినిమా రిలీజ్ అయిన రోజే.. ఇప్పుడు రవితేజ మిస్టర్ బచ్చన్ విడుదలవుతుంది. దీని వల్ల పూరీ, రవితేజ మధ్య విభేదాలు కూడా తలెత్తినట్లు వార్తలు వైరల్ అవుతున్నాయి. రామ్ పోతినేని హీరోగా నటిస్తున్న డబుల్ ఇస్మార్ట్ ను ఆగస్టు 15వ తేదీన విడుదల చేయనున్నట్లు మేకర్స్ ఎప్పుడో ప్రకటించారు. కానీ మిస్టర్ బచ్చన్ ను రిలీజ్ డేట్ మాత్రం రీసెంట్ గా అనౌన్స్ చేశారు. దీంతో పూరీ జగన్నాథ్ ఫీల్ అయినట్లు చెబుతున్నారు. అయితే ఈ డిస్కషన్.. మేకర్స్ వల్ల కాదని ఓటీటీస్ వల్ల వచ్చాయని అంటున్నారు. రిలీజ్ డేట్స్ ఫిక్స్ చేయడం మేకర్స్ చేతుల్లో లేదని చెబుతున్నారు. ఇప్పుడు ఈ విషయం హాట్ టాపిక్ గా మారింది. అయితే డబుల్ ఇస్మార్ట్ షూటింగ్ జరుగుతున్న సమయంలో ఆర్థిక సమస్యలు వచ్చినట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. అదే సమయంలో ఒక ఫైనాన్షియర్ బిగ్ హెల్ప్ చేయడంతో షూటింగ్ సక్సెస్ ఫుల్ గా కంప్లీట్ అయినట్లు సమాచారం. దీంతో డిజిటల్ రైట్స్ విక్రయించిన తర్వాత.. ఆ డబ్బులతో రిటర్న్ ఇద్దామని అనుకున్నారట పూరీ. దీంతో మేకర్స్ డిమాండ్ చేసిన డబ్బులు ఇచ్చేందుకు మొగ్గు చూపిన ఓ ఓటీటీ సంస్థ ఆగస్టు 15న విడుదల చేయాలని కండిషన్ పెట్టిందని వినికిడి. అదే టైంలో పుష్ప కూడా వాయిదా పడడంతో డేట్ ఫిక్స్ చేసేశారు. ఇక మిస్టర్ బచ్చన్ మూవీ విషయంలో కూడా అలాగే జరిగిందట. ఆ సినిమా ప్రొడక్షన్ హౌస్.. డిజిటల్ హక్కుల ద్వారా సాలిడ్ డీల్ కుదుర్చుకోవాలని యోచించిందట. దీంతో మిస్టర్ బచ్చన్ ఓటీటీ రైట్స్ కొనుగోలు చేసిన సంస్థ.. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విడుదల చేయమని కండిషన్ పెట్టిందని తెలుస్తోంది. అక్కడికి రెండు వారాల తర్వాత ఓటీటీలో స్ట్రీమింగ్ చేస్తామని చెప్పినట్లు సమాచారం. దీంతో అలా అనుకోకుండా రెండు సినిమాలు కూడా ఆగస్టు 15వ తేదీన రిలీజ్ అవుతున్నాయి. మరి వాటి రిజల్ట్స్ ఎలా ఉంటాయో చూడాలి.

# నడువొంపులు నాభి సొగసుతో చంపేస్తోంది

అవును.. ఆమె నాగినిలా మాయ చేస్తోంది! నాగ స్వరం ముందు ఆడే త్రాచులా కనిపిస్తోంది. ఆ అందాల నయగారం నడువొంపులు.. నాభి సొగసుతో కిల్ చేస్తోంది. వాలు చూపులతో వలలు విసురుతోంది. ఈ బ్యూటీ ట్రాప్ లో పడనిది.. వలలకు చిక్కనిది ఎవరు? కచ్చితంగా ఈ అందానికి దాసోహం అనాల్సిందే. బుల్లితెర నుంచి వెండితెరకు ప్రమోటైన మౌనిరాయ్ గురించే ఇదంతా. ఏక్తా కపూర్ నిర్మించిన బుల్లితెర షో క్యుంకీ సాస్ భీ కభీ బహు థీతో తన నటనా జీవితాన్ని ప్రారంభించిన మౌని రాయ్, గోల్డ్ చిత్రంతో సినీరంగంలో ప్రవేశించింది. సినిమాలు చేస్తూనే మ్యూజిక్ వీడియోలలో విజయవంతమైన పరివర్తనను సాధించింది. తనదైన అద్భుత రూపం ప్రతిభతో మెస్మరైజ్ చేసింది ఈ బ్యూటీ. మౌనికి సోషల్ మీడియాల్లో విపరీతమైన ఫాలోయింగ్ ఉంది. ఇప్పటికే తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా విభిన్నమై లుక్ లతో నిండి ఉంది. మౌని తాజాగా నల్ల కోకలో సింగారం ఒలకబోసిన ఫోటోలు ఇప్పుడు ఇంటర్నెట్ ని షేక్ చేస్తున్నాయి. ఇదిగో ఇలా సోఫాపై చిత్రవిచిత్రమైన భంగిమలతో ఫోజులివ్వగా అవన్నీ



వైరల్ గా మారిపోతున్నాయి. ముఖ్యంగా మౌని తన సన్నజాజి నడుము, నాభి సౌందర్యాన్ని ఎలివేట్ చేస్తూ ఫోజులిచ్చింది. వెబ్ లో ఇవన్నీ స్పీడ్ గా దూసుకెళుతున్నాయి. హిందీ టెలివిజన్ పరిశ్రమలో పాపులర్ నేమ్ మౌని రాయ్ నాగిన్, నాగిన్ సీక్వెల్‌లో మెస్మరైజింగ్ పెర్ఫార్మెన్స్ తర్వాత అత్యధిక పారితోషికం తీసుకునే నటీమణులలో ఒకరిగా అగ్రస్థానానికి ఎగబాకింది. తనదైన నటన, ఫ్యాషన్ సెన్స్ తో సినీప్రముఖుల దృష్టిని విశేషంగా ఆకర్షించింది.

ఇక మౌని బోల్డ్ స్టైల్ ఎంపికలతో తన అభిమానులను నిరంతరం ఆశ్చర్యపరుస్తుంది. నాగిన్‌లో నటించిన తర్వాత గొప్ప పాపులారిటీ సంపాదించిన మౌని 2018లో అక్షయ్ కుమార్ గోల్డ్ చిత్రంతో బాలీవుడ్‌లోకి అడుగుపెట్టింది. గత సంవత్సరం మౌని అయాన్ ముఖర్జీ చిత్రం బ్రహ్మాస్త్రలో కనిపించింది. ఇటీవల జుబిన్ నౌటియాల్‌తో కలిసి డోటరా అనే మ్యూజిక్ వీడియోలో కూడా కనిపించింది. మౌని రాయ్ వెబ్ సిరీస్ సుల్తాన్ ఆఫ్ ఢిల్లీలో కూడా కనిపించింది. చివరిగా ఇమ్రాన్ హష్మీ నటించిన షోటైమ్‌లో కనిపించింది. ఇటీవలి ఇంటర్వ్యూలో మౌని మాట్లాడుతూ.. సుల్తాన్ ఆఫ్ ఢిల్లీ, బ్రహ్మాస్త్ర వంటి ప్రాజెక్టులు తన నటనపై ప్రజల అభిప్రాయాన్ని మార్చాయని వ్యాఖ్యానించింది. కెరీర్ లో వైవిధ్యమైన పాత్రలు తనవైపు వస్తున్నాయని ఆనందం వ్యక్తం చేసింది. తనలోని బోల్డ్ కోణాన్ని ఆవిష్కరించే ఛాన్స్ కూడా ఉందని తెలిపింది.

# తమన్నా ఇదే రిపీట్ అయితే

స్టార్ హీరోయిన్ తమన్నాకు ఎలాంటి క్రేజ్ ఉందో అందరికీ తెలిసిందే. కొన్నేళ్లుగా హీరోయిన్ గా తన సత్తా చాటుతున్న అమ్మడు.. స్పెషల్ సాంగ్స్ తోనూ ఓ రేంజ్ లో అందరినీ అలరిస్తోంది. హీరోయిన్స్ లో తమన్నా కాస్త గ్రేస్ ఫుల్ డ్యాన్సర్ అనే చెప్పాలి. ఆమె ఐటెం సాంగ్ చేస్తే మూవీకి ఎక్స్ ట్రా మైలేజీ వస్తుంది. అందరి దృష్టి సినిమాపై పడుతుంది. కెరీర్ పీక్స్ లో ఉన్నప్పుడు బెల్లంకొండ సాయి శ్రీనివాస్ అల్లుడు శీను మూవీలో లబ్బర్ బొమ్మ పాటలో డ్యాన్స్ ఇరగదీసింది తమన్నా. అ తర్వాత జై లవకుశ, గని, స్పీడున్నోడు సినిమాల్లో స్పెషల్ సాంగ్స్ తో అలరించింది. అయితే ప్రతి సాంగ్ కూడా సూపర్ డూపర్ హిట్టే. ఇక రీసెంట్ గా కోలీవుడ్ సూపర్ స్టార్ రజినీకాంత్ జైలర్ సినిమాలో నువ్వు కావాలయ్యా పాటతో ఓ ఊపు ఊపేసింది. గ్లామర్ డోస్ పెంచేసి మరీ స్టెప్పులేసింది. ఇప్పటికే ఈ పాట ట్రెండింగ్ లోనే ఉంటుంది. జైలర్ మూవీకి రిలీజ్ కు ముందు క్రియేట్ అయిన హైప్.. తమన్నా వల్లే వచ్చిందని చెప్పడంలో ఎలాంటి డౌట్ అక్కర్లేదు. ఇప్పుడు తమన్నా మరో ఐటెం సాంగ్ తో వచ్చేస్తున్న విషయం తెలిసిందే. బాలీవుడ్ స్త్రీ 2 మూవీలో ఆజ్ కా రాత్ స్పెషల్ సాంగ్ తో సందడి చేయనుంది అమ్మడు. 2018లో వచ్చిన స్త్రీ మూవీలో నోరా ఫతేహి



ఐటెం సాంగ్ చేయగా.. ఇప్పుడు సీక్వెల్ లో తమన్నా చిందులేసింది. అందుకు సంబంధించిన వీడియో సాంగ్ ను మేకర్స్ రీసెంట్ గా రిలీజ్ చేశారు. పాటలో తన డ్యాన్స్ తో అందరినీ ఆకట్టుకుంటోంది మిల్కీ బ్యూటీ. గ్లామర్ బొనాంజాతో బీటౌన్ ఆడియన్స్ ను అలరిస్తోంది. తమన్నా డ్యాన్స్ చూసి బాలీవుడ్ సినీ ప్రియులు ఆశ్చర్యపోతున్నారు. ఆమె లుక్స్ కు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ఇప్పటికే చేసిన ఐటెం సాంగ్స్ కంటే.. ఆజ్ కా రాత్ పాటలో తమన్నా మరింత గ్లామర్ షో చేసింది. తన స్కిన్ టోన్ తోపాటు అందాలతో అలరించింది. అయితే కొందరు మాత్రం కంటిన్యూగా గ్లామర్ షోతో స్పెషల్ సాంగ్స్ చేయడం కరెక్ట్ కాదని చెబుతున్నారు.

వరుస గ్లామర్ ట్రీట్స్.. ఆడియన్స్ కు బోర్ తెప్పించే అవకాశం ఉందని అంటున్నారు. అయితే సిమ్రాన్, ఇలియానా వంటి పలు హీరోయిన్లు తమ గ్లామర్ షోతో ఓ రేంజ్ లో అలరించారు. కానీ ఒక్కసారిగా డౌన్ అయిపోయారు. కాబట్టి తమన్నా అలా జరగకుండా చూసుకోవాలని సజెస్ట్ చేస్తున్నారు. స్పెషల్ సాంగ్స్ చేయడం తప్పులేదని.. కానీ అన్నీ గ్లామర్ షోతోనే ఉంటే కెరీర్ కు ఇబ్బంది వచ్చే అవకాశం ఉందని అంటున్నారు. మరి తమన్నా ఈ విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి. ప్రస్తుతం తమన్నా.. ఓదెల2తో పాటు పలు చిత్రాల్లో నటిస్తోంది.




# అప్పులకు విముక్తి.. రూ.6,190 కోట్లు పంట రుణమాఫీ

హైదరాబాద్: రైతు ప్రయోజనాలే కాంగ్రెస్ ప్రభుత్వానికి ముఖ్యమని, అందుకనే రుణమాఫీ చేశామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. కార్పొరేట్ సంస్థల అధిపతులు బ్యాంకులను మోసం చేస్తున్నారన్న ఆయన.. గత పదేళ్లలో కార్పొరేట్ కంపెనీలు రూ.14 లక్షల కోట్లు ఎగవేశాయని చెప్పారు. కానీ, సాగుకోసం బ్యాంకుల నుంచి తెచ్చిన అప్పులు తిరిగి కట్టలేక రైతులు నానా అవస్థలు పడుతున్నారని అందుకే కాంగ్రెస్ ప్రభుత్వం వాళ్ల రుణాలను మాఫీ చేస్తోందని చెప్పారు. రెండో విడత పంట రుణాల మాఫీ నిధుల విడుదల సందర్భంగా శాసనసభ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రేవంత్ మాట్లాడారు. "గతంలో అనేక మంది రైతులు సొంత పొలంలోనే పురుగుల మందు తాగి ప్రాణాలు కోల్పోయారు. ఏ రైతు కూడా ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోకూడదనేదే మా విధానం. అందుకే ఇవాళ రూ.లక్షన్నర వరకు ఉన్న రైతు రుణాలన్నీ మాఫీ చేశాం. రాష్ట్రంలోని రైతులందరి ఇళ్లల్లో ఇవాళ పండుగ రోజు. సోనియా గాంధీ, రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీ మేరకు రైతులకు రుణమాఫీ చేశాం. రెండో విడతగా రూ.6,190 కోట్లు మాఫీ చేశాం." అన్నారు. రుణమాఫీ కింద సుమారు 6.4 లక్షల మంది రైతుల ఖాతాల్లో రెండో విడతగా రూ.6,190 కోట్లు జమ చేసింది. తొలి విడతలో 11.34 లక్షల మంది రైతులకు రూ.6,035 కోట్లు విడుదల చేశారు. ఇప్పటి వరకు 17.75 లక్షల మంది రైతులకు లబ్ది చేకూరింది. రెండు దశల్లో కలిపి రైతుల ఖాతాల్లో రూ.12,225 కోట్లు జమ చేశారు.

**గతం కంటే భిన్నంగా రైతు భరోసా విధివిధానాలు: తుమ్మల...** గత ప్రభుత్వంలో పూర్తిగా మూలనపడ్డ పంటల బీమా పథకాన్ని పునరుద్ధరిస్తామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రెండో విడత రుణమాఫీ కార్యక్రమంలో భాగంగా మాట్లాడిన మంత్రి... ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన రుణమాఫీ హామీని నిలబెట్టుకున్నామన్నారు. ఒకే పంటకాలంలో రూ.2 లక్షల మేర రుణమాఫీ చేస్తున్న ఏకైక పార్టీ కాంగ్రెస్ అని కొనియాడారు. ఆయిల్‌పామ్ సరఫరాలో రాబోయే ఐదేళ్లలో రాష్ట్రం అగ్రస్థానంలో ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. " రైతులకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకుంటున్నాం. ఆగస్టులో రూ.2 లక్షల్లోపు ఉన్న రుణమాఫీని కూడా అమలు చేస్తాం. పంటలబీమా ద్వారా రైతులకు అండగా ఉంటాం. త్వరలోనే గతంలో కంటే భిన్నంగా రైతుభరోసా విధివిధానాలు రూపొందిస్తాం. ఐదేళ్లలో 5 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ వేయాలని కోరుతున్నాం. అనేక రాష్ట్రాలకు పామాయిల్ సరఫరా చేసే స్థాయికి మనం చేరాలి. రైతేరాజు అనే నినాదానికి కాంగ్రెస్ ప్రభుత్వం నిజమైన అర్థం చెబుతోంది" అని తుమ్మల అన్నారు.

**అందరూ అనుమానించారు..కానీ,: భట్టి ....** రాహుల్ గాంధీ హామీలు ఇచ్చినప్పుడు అందరూ అనుమానాలు వ్యక్తం చేశారని, వారి అనుమానాలను పటాపంచలు చేస్తూ రుణమాఫీ చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. రైతుల మేలుకోరే రుణమాఫీపై శరవేగంగా నిర్ణయాలు తీసుకున్నామన్నారు. ఈ సందర్భంగా రెండో విడతగా రుణమాఫీ పొందిన లబ్ధిదారులకు ఆయన అభినందనలు తెలిపారు.




# వయనాడ్ విలయం: ధ్వంసమైన ఏకైక వంతెన – సహాయక బృందాలకు సవాల్..!

కేరళలోని వయనాడ్‌లో మృతుల సంఖ్య వేగంగా పెరుగుతోంది. ఇప్పటివరకు 93 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో మెప్పాడి ఆస్పత్రిలోనే 18 మరణాలు నమోదయ్యాయి. మరోవైపు సహాయక చర్యలకు తీవ్ర ఆటంకాలు ఏర్పడుతున్నాయి. పర్యటక ప్రాంతమైన మెప్పాడులో పరిస్థితి ఘోరంగా ఉంది. ఇక్కడి ముండక్కై ప్రాంతంలో భారీ సంఖ్యలో ప్రాణనష్టం జరిగింది. చలియార్ నది సమీపంలో దాదాపు 10 మృతదేహాలను స్వాధీనం చేసుకొన్నారు. ఇక చురల్మల వద్దనున్న ఏకైక వంతెన, ప్రధాన రహదారి ధ్వంసమయ్యాయి. దీంతో 250మంది ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది ముండక్కై ఆవలవైపు సహాయక చర్యలు చేపడుతున్నారు. సైన్యం ఇక్కడ తాత్కాలిక వంతెనను నిర్మిస్తే ఆ ప్రాంతానికి చేరుకొని చర్యలు చేపట్టనున్నారు. అసలు ఆ గ్రామంలో పరిస్థితి ఏమిటనేది ఇప్పటివరకు పూర్తి సమాచారం తెలియడం లేదు. అక్కడ కేవలం హెలికాప్టర్లతోనే స్వల్ప సాయం చేయగలిగే అవకాశం ఉంది. ఇప్పటికే వాయుసేనకు చెందిన రెండు హెలికాప్టర్లు సులురు నుంచి వయనాడ్‌కు చేరుకొన్నాయి. భారీ వర్షాలు కొనసాగుతుండటంతో హెలికాప్టర్లు కూడా పరిమిత స్థాయిలో సేవలు అందించే పరిస్థితి నెలకొంది. ఈ హెలికాప్టర్లు కొండచరియలు పడిన ప్రాంతంలో ల్యాండ్ అయ్యే పరిస్థితి లేకపోవడం సమస్యాత్మకంగా మారడంతో అవి కోజికోడ్‌కు తిరిగివెళ్లాయి. పనమరం, కరమాంతొడే, కబానీ నదుల నుంచి నీటి ప్రవాహం పెరగడంతో బాణుసురసాగర్ డ్యామ్ గేట్లు ఎత్తేశారు.

**మెప్పాడి రిసార్టులో 150 మంది..** మెప్పాడి సమీపంలోని ట్రీ వ్యాలీ రిసార్ట్ లో 150 మంది చిక్కుకుపోయారు. రాత్రివేళ వర్షం పడుతుండటంతో కొందరు స్థానికులు కూడా అక్కడ తలదాచుకొన్నారు. ప్రస్తుతానికి అందరూ సురక్షితంగానే ఉన్నారు. ఆ ప్రాంతంలో మొత్తం కొండచరియలు విరిగిపడినట్లు రిసార్ట్ వర్గాలు వెల్లడించాయి. దీంతో దాదాపు 40 ఇళ్లు ధ్వంసమైనట్లు పేర్కొన్నారు.


**ఐదు జిల్లాల్లో రెడ్ అలర్ట్ :** కేరళలోని ఐదు జిల్లాల్లో వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ ప్రకటించింది. వీటిల్లో మల్లప్పురం, కోజీకోడ్, వయనాడ్, కసరగొడ్, కన్నూరు ఉన్నాయి. రానున్న 24 గంటల్లో ఇక్కడ అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఇక ఎర్నాకులం, ఇడుక్కీ, త్రిశూర్, పాల్కడ్ జిల్లాల్లో ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది.

**రంగంలోకి సైన్యం స్పెషలిస్టు బృందాలు :** వయనాడ్‌లో సహాయక చర్యలు చేపట్టేందుకు కన్నూర్‌లోని డిఫెన్స్ సెక్యూరిటీ కోర్ నుంచి రెండు వరద సహాయక కాలమ్స్‌ను వయనాడ్‌కు తరలించారు. బెంగళూరు నుంచి ఆర్మీ ఇంజినీర్ కోర్ బృందం బయల్దేరింది. అది త్వరలోనే వయనాడ్ చేరుకోనుంది. కొండచరియల తొలగింపు, తాత్కాలిక నిర్మాణాల్లో వీరికి నైపుణ్యం ఉంది. మరోవైపు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ ఆర్మీచీఫ్ ఉపేంద్ర ద్వివేదితో కేరళలోని పరిస్థితిపై చర్చించారు. ఇప్పటికే 122 ఇన్‌ఫాంట్రీ బెటాలియన్‌కు చెందిన రెండు కాలమ్స్ వెళ్లినట్లు ఆర్మీ చీఫ్ పేర్కొన్నారు. మొత్తం 225 మంది సహాయక చర్యల్లో పాల్గొన్నారు.



# తిరిగి భారాసలో చేరిన గద్వాల ఎమ్మెల్యే

హైదరాబాద్: గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి తిరిగి భారాసలో చేరారు. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆయన్ను పార్టీలోకి ఆహ్వానించారు. అసెంబ్లీ ఎన్నికల్లో బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి గద్వాల స్థానం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఇటీవల ఆయన భారాస నుంచి కాంగ్రెస్‌లో చేరారు. తాజా ఘటనతో భారాస శ్రేణుల్లో ఉత్సాహం కనిపిస్తోంది.




# విద్యుత్ విచారణ కమిషన్ కొత్త ఛైర్మన్ నియామకం

హైదరాబాద్: తెలంగాణ విద్యుత్ కమిషన్ కొత్త ఛైర్మన్‌గా జస్టిస్ మదన్ భీమ్ రావు లోకూర్‌ని రాష్ట్ర ప్రభుత్వం సోమవారం నాడు నియమించింది. లోకూర్ సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పలు కీలక కేసుల్లో తీర్పును వెలువరించారు. 1953, డిసెంబర్ 31న జన్మించారు. 1977, జూలై 28న న్యాయవాద వృత్తిని ఆయన ప్రారంభించారు. 2010%-%12 మధ్యకాలంలో గువాహటి, ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నిధులు నిర్వర్తించారు. 2012 జూన్‌లో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా లోకూర్‌ను నియమించారు. భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ)తో కలిసి 47 కేసుల్లో కీలక తీర్పులు ఇచ్చారు. అప్పటి సీజేఐ జస్టిస్ దీపక్ మిశ్రా వ్యవహారశైలికి వ్యతిరేకంగా మీడియా సమావేశం ఏర్పాటు చేసిన నలుగురు జడ్జీల్లో జస్టిస్ లోకూర్ ఒకరు. బీఆర్ఎస్ హయాంలో విద్యుత్ కొనుగోలు, ప్లాంట్ల నిర్మాణంలో జరిగిన అవకతవకలను బయటపెట్టేందుకు రేవంత్ సర్కార్ వేగంగా చర్యలు తీసుకుంటుంది. ఇందులో భాగంగా విద్యుత్ కమిషన్‌కు కొత్త ఛైర్మన్‌ను నియమించింది. కేసీఆర్ ప్రభుత్వంలో జరిగిన విద్యుత్ ఒప్పందాలు, యాదాద్రి, భద్రాద్రి పవర్ ప్లాంట్ల అవకతవకలపై జ్యుడీషియల్ విచారణను ప్రభుత్వం వేగవంతం చేసింది. అయితే, లోకూర్ మళ్లీ మొదటి నుంచి మొదటి నుంచి పలు కీలక అంశాలపై విచారణ జరిపే అవకాశం ఉంది. ఏ ఏ అంశాలపై జస్టిస్ నరసింహారెడ్డి విచారణ జరిపారో ఆయా అంశాలపై విచారణనె లోకూర్ కొనసాగించనున్నారు.

**యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో రూ.15 వేల కోట్ల దోపిడీ..** మరోవైపు, నిన్న అసెంబ్లీలో విద్యుత్ అంశంపై సుదీర్ఘ చర్చ జరిగింది. అధికార, ప్రతిపక్ష నేతల మధ్య మాటల యుద్ధం తారా స్థాయికి చేరింది. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో రూ.15 వేల కోట్ల దోపిడీ జరిగిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. భద్రాద్రి పవర్ ప్రాజెక్టులోనూ మెగావాట్‌కు రూ.రెండున్నర కోట్ల చొప్పున అంచనా పెంచి.. మొత్తంగా రూ.రెండున్నర వేల కోట్లు అక్రమాల లెక్కతేలాలని అన్నారు. దొరికిపోతామని అర్థమైనందునే.. మాజీ సీఎం కేసీఆర్ సుప్రీంకోర్టుకు వెళ్లి విచారణ కమిషన్‌ను రద్దు చేయాలంటూ కోరారని ఆరోపించారు. కానీ, విచారణ అనంతరం సుప్రీంకోర్టు కమిషన్‌ను కొనసాగించాల్సిందిగా స్పష్టం చేసిందని తెలిపారు. సోమవారం అసెంబ్లీలో చర్చ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ, "మాజీ మంత్రి ఆవేదన చూస్తుంటే ఇప్పటికే చర్లపల్లి జైల్లో ఉన్నట్లుంది. జ్యుడీషియల్ విచారణ మేము అనలేదు. ఇదే సభలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కొన్ని అంశాల్ని ప్రస్తావించినప్పుడు మా నిజాయితీని మేం నిరూపించుకుంటాం.. విచారణకు ఆదేశాలివ్వాలని కోరారు.

**వారే కోర్టుకెళ్లారు..** ఛత్తీస్‌గఢ్ నుంచి కొనుగోలు చేసిన వెయ్యి మెగావాట్ల విద్యుత్ ఒప్పందం, యాదాద్రి 260 ఇన్‌టూ 4, సబ్‌క్రిటికల్ టెక్నాలజీతో 1040 మెగావాట్ల భద్రాద్రి పవర్ ప్రాజెక్టు నిర్మాణం, యాదాద్రి 4వేల విద్యుత్ ఒప్పందం బీహెచ్ఈఎల్‌కు ఇవ్వడంపై వారు అడిగితేనే ఆమోదించాం. కమిషన్ సమన్లు ఇచ్చినప్పుడు తమ వాదనలు వినిపిస్తే వాళ్ల నిజాయితీ బయటకు వచ్చేది. అక్కడికి వెళ్లకుండా ఆ కమిషనే వద్దు అని కోర్టుకు వెళ్లారు. హైకోర్టు వారి వాదనను తిరస్కరించింది. సుప్రీంకోర్టుకు వెళ్తే విచారణ కొనసాగించాల్సిందేనని స్పష్టం చేసింది. కమిషన్ ఛైర్మన్ పట్ల అభ్యంతరాలు ఉంటే వ్యక్తిని మార్చేందుకు ప్రభుత్వాన్ని సూచించింది. ఈ రోజు సాయంత్రంలోగా కొత్త ఛైర్మన్‌ను నియమిస్తాం" అని సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు.




# గద్దర్ అవార్డ్ ప్రతిపాదన పెట్టాం.. అయినా పట్టించుకోలేదు

తెలుగు చలనచిత్ర పరిశ్రమ టాలీవుడ్‌పై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గద్దర్ అవార్డులపై రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రతిపాదనకు తెలుగు చిత్ర పరిశ్రమ నుంచి స్పందన లేకపోవడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. ప్రతిష్టాత్మక నంది అవార్డులను గద్దర్ అవార్డులతో భర్తీ చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఏడాది నిర్ణయాన్ని ప్రకటించింది. ఈ కొత్త కార్యక్రమాన్ని ఎలా సమర్థవంతంగా అమలు చేయాలనే దానిపై అభిప్రాయాన్ని, సూచనలను అందించాలని తెలుగు చిత్ర పరిశ్రమను సీఎం రేవంతరెడ్డి కోరారు. అయితే ఈ విషయంపై సినీ పరిశ్రమ మౌనంగా ఉందని ఆయన అన్నారు. ప్రముఖ తమిళ రచయిత, ఉద్యమకారుడు శివశంకరికి 'విశ్వంభర డాక్టర్ సి. నారాయణరెడ్డి జాతీయ సాహిత్య పురస్కారం' ప్రదానం సందర్భంగా రేవంత రెడ్డి కామెంట్స్ చేశారు. "తెలుగు చిత్ర పరిశ్రమలో చేసిన కృషికి, విజయాలకు గౌరవంగా గద్దర్ అవార్డులను ప్రకటించాం. దీనిపై కార్యచరణ సిద్ధం చేయమని పరిశ్రమను కోరాం. సినీ పరిశ్రమ పెద్దల నుంచి ఎలాంటి స్పందన లేకపోవటం బాధాకరం" అని ముఖమంత్రి అన్నారు.



# తెలంగాణ సంస్కృతికి అద్దంపట్టేదే బోనాల పండుగ

బీర్కూర్: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దంపట్టే సంబరాలే బోనాల పండగ అని రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ ఛైర్మన్ కాసుల బాలరాజు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం పేర్కొన్నారు. బీర్కూర్‌లో నిర్వహించిన బోనాల పండగ సంబరాలకు మంగళవారం వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వీరిద్దరు బోనం ఎత్తారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శంకర్, తాషీరామ్, శశికాంత్, గంగారం, చందు, అవారి గంగారం, తదితరులు పాల్గొన్నారు.




# 10 అడుగుల గదికి రూ. 12 వేలు.. సివిల్స్ విద్యార్థుల దుస్థితి..!

ఢిల్లీ: ఐఏఎస్ కావాలని చాలామంది కలలు కంటుంటారు. అందుకోసం కుటుంబాలను విడిచి దేశం నలుమూలల నుంచి లక్షల మంది దేశ రాజధాని ఢిల్లీకి వచ్చి లక్ష్య చేధన కోసం శ్రమిస్తుంటారు. ఇదే అదునుగా భావించి కొందరు తమ ఇంటి అద్దెను విపరీతంగా పెంచేస్తున్నారు. సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్న ఓ విద్యార్థి గదికి సంబంధించిన వీడియో తాజాగా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కేవలం 10 అడుగుల పొడవు, వెడల్పు కలిగిన గదిలో ఓ విద్యార్థి సివిల్స్‌కు సన్నద్ధమవుతున్నాడు. ఒక టేబుల్, కొన్ని పుస్తకాలు, ఒక కుర్చీ, నడవడానికి కాస్త స్థలం మాత్రమే ఉంది. లోపల ఒకరు ఉంటే మరొకరు కాసేపు ఉండేందుకు చోటు కూడా లేని పరిస్థితి. దుస్తులను కూడా లోపలే ఆరబెట్టుకోవాల్సిన దుస్థితి. ఈ ఇరుకుగదికి యజమానులు రూ.12 నుంచి రూ.15 వేల వరకు అద్దె వసూలు చేస్తున్నారు. ఏటా అద్దె పెరుగుతూనే ఉంటుంది. నగరంలోని చాలా ప్రాంతాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ఇలాంటిచోట ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటూ విద్యార్థులు పరీక్షకు సన్నద్ధం అవుతున్నారు. దీనికి సంబంధించిన వీడియోను డీఎస్పీ అంజలి కటారియా ఖాతాలో షేర్ చేశారు. విద్యార్థుల దుస్థితిపై ఆందోళన వ్యక్తంచేశారు. "10%శ%10 చిన్న గదికి విద్యార్థులు రూ.వేలు చెల్లిస్తున్నారు.

ఇంటి నుంచి దూరంగా ఉండాలని మాత్రమే ఢిల్లీకి రావొద్దు. మీ కుటుంబం డబ్బును వృథా చేయకండి. ఆన్‌లైన్ వీడియో ద్వారా ప్రిపేర్ అవడానికే విద్యార్థులు ఇంత మొత్తం చెల్లిస్తున్నారు. ఇది ఆలోచించాల్సిన విషయం" అని పోస్టు చేశారు. కాగా.. ఇటీవల ఢిల్లీలోని కోచింగ్ సెంటర్ బేస్‌మెంట్‌లోకి వరద నీరు చేరడంతో ముగ్గురు సివిల్స్ విద్యార్థులు మృతి చెందిన ఘటన దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. సరైన వాతావరణం లేనిచోట తాము ప్రిపేర్ అవుతున్నామంటున్న విద్యార్థులు.. ఆ ముగ్గురి మరణాలకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. దీంతో కోచింగ్ సెంటర్ యజమానిని అరెస్టు చేసిన పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలోనే విద్యార్థులు నిత్యం ఎదుర్కొంటున్న సమస్యలు వెలుగులోకి వస్తున్నాయి.

# కదులుతున్న బస్సులో మహిళపై అత్యాచారం.. పరారీలో డ్రైవర్




హైదరాబాద్: కదులుతున్న బస్సులో మహిళపై అత్యాచారం ఘటన సంచలనం రేపింది. తెలంగాణలోని నిర్మల్ నుంచి ఏపీలోని ప్రకాశం జిల్లాకు వెళ్తున్న బస్సులో మహిళపై అఘాయిత్యం జరిగింది. నోట్లో గుడ్డలు కుక్కి డ్రైవర్ తనపై అత్యాచారం చేశాడని డయల్ 100 ద్వారా బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో అప్రమత్తమైన పోలీసులు ఓయూ పీఎస్ సమీపంలో బస్సును ఆపి సీజ్ చేశారు. బస్సులో ఇద్దరు డ్రైవర్లు ఉండగా ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. పరారీలో ఉన్న మరో డ్రైవర్ (ప్రధాన నిందితుడి) కోసం గాలిస్తున్నట్లు సీఐ రాజేందర్ వెల్లడించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com